RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 70 శనివారం 5 ఏప్రిల్ 2025 పేజీలు : 4

### భద్రతా వలయంలో రామేశ్వరం..

చెన్నై: రామనాథపురం జిల్లాలోని రామేశ్వరం కేంద్ర బలగాల భద్రతా వలయంలోకి వెళ్ళిపోయింది. క్షేత్రస్థా యి ప్రాంతాలను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధీనంలోకి తీసుకుంది. ఈ నెల 6వ తేదీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రామేశ్వరం రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రామేశ్వరం-మండపం ప్రాంతాలను కలుపుతూ సముద్రంలో నిర్మించిన పాంబన్ వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చే యనున్నారు. ఆ తర్వాత రామేశ్వరం లోని రామనాథ స్వామివారిని దర్శించుకుంటారు. ఆ తరువాత బస్టాండు సమీపంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. సుమారు 3 గంటల పాటు ఆయన రామేశ్వరంలోనే గడపన్నారు. ఇందుకోసం స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పా ట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి భద్ర తా విభాగం అధికారులు ముందుగా రామేశ్వరానికి చేరుకుని, ప్రధాని పాల్గొనే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.



# హైవోల్టేజ్ పొలిటిక్స్!

## ప్రధాన పార్టీల కొత్త ప్లాన్స్ ఇవేనా?

విమర్శలు.. ప్రతివిమర్శలు, కౌంటర్లు.. ఎన్ కౌంటర్లతో ఇప్పటి వరకు సాగిన తెలంగాణ రాజకీయం ఇక కొత్త ట్రాక్ లోకి వెళ్లబోతోంది. ఏప్రిల్ రెండవ వారం తరువాత అంతా ఫేస్ టూ ఫేస్.. నెక్ టూ నెక్ అనేలా హై వోల్టేజ్ పొలిటిక్స్ సాగబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ కొత్త అస్త్రాలను సిద్ధం చేసుకుంటుంటే వాటిని ఎదుర్కొనేందుకు ప్రత్యర్థులు కౌంటర్ ప్లాన్ లు రెడీ చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ కు ఇచ్చిన ఏడాది గవుదు ముగిసిపోవడంతో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు అధికార పక్షంపై సై అంటే సై అనేలా రాజకీయం చేసేందుకు సై అంటున్నారు. మూడు ప్రధాన పార్టీల మధ్య పొలిటికల్ వార్ నేపథ్యంలో ఈసారి పొలిటికల్ హీట్ ఎలాంటి టర్న్ లు.. యూ టర్న్ లు మరెలాంటి ట్విస్ట్ లు ఉండబోతున్నాయనేది ఇంట్రెస్టింగ్ గా మారింది.

**మంత్రి వర్గ విస్తరణతో ప్రజాక్షేత్రంలోకి..** ప్రజాక్షేత్రంలో పార్టీ కార్యక్రమాలను స్పీడప్ చేసేందుకు అధికార కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోంది. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న మంత్రి వర్గ విస్తరణను దాదాపుగా రెండో వారానికి అటు ఇటుగా పూర్తి చేసి పార్టీ, ప్రభుత్వ పరంగా కొత్త జోష్ నింపేందుకు కసరత్తు చేస్తోంది.

నామినేటెడ్ పదవులు, పీసీసీ కార్యవర్గ కూర్పు చేసి పార్టీ క్యాడర్ లో ఉత్సాహం నింపాలని చూస్తోంది.

రాష్ట్రానికి కొత్తగా వచ్చిన ఏఐసీసీ ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ సైలెంట్ గా తన పని తాను చేసుకుంటూ వెళ్తున్నారు. ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా స్టేట్ పొలిటిక్స్ ను రంజుగా మార్చేందుకు హస్తం పార్టీ అవసరమైన ప్లాన్లు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**కేసీఆర్ నయా స్కెచ్:** బీఆర్ఎస్ సైతం సరికొత్త కార్యాచరణతో ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కారు పార్టీ సిద్ధం అవుతున్నది. పార్టీ ఆవిర్భావదినోత్సవం వేదికగా పార్టీ శ్రేణులకు గులాబీ బాస్ కేసీఆర్ కీలక దిశానిర్దేశం చేయబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ వైఫల్యాలు, నిర్ణయాలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తున్నా అధినేత కేసీఆర్ ప్రజాక్షేత్రానికి దూరంగా ఉండటం గులాబీ పార్టీకి పెద్ద మైనస్ అనే టాక్ వినిపిస్తోంది. దీంతో పార్టీ ప్లీనరీ తర్వాత నయా స్కెచ్ తో కేసీఆర్ పార్టీని ముందుకు తీసుకుపోబోతున్నారనే చర్చ గులాబీ పార్టీలో వినిపిస్తోంది. అధికార కాంగ్రెస్ రౌండప్ చేసేలా కొత్త కార్యచరణను సిద్ధం చేసుకుని ఉగాది తర్వాత ఆచరణలో పెట్టి పెట్టేందుకు గట్టి ప్రయత్నాలు ఉండబోతున్నట్లు చర్చ జరుగుతోంది.

**బీజేపీని ఊరిస్తున్న కొత్త బాస్ పోస్టు:** తెలంగాణ బీజేపీలో రోజు రోజుకు కొత్త ఊపు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో తన కెపాసిటీని పెంచుకుంటూ వస్తున్న బీజేపీలో కొత్త బాస్ అంశం ఇప్పటికీ ఊరిస్తూనే ఉంది. రాష్ట్ర రథసారథిగా కొత్త వ్యక్తి నియామకం దాదాపు ఖరారైందని ఏ క్షణమైనా రాష్ట్ర అధ్యక్షుడి పేరును పార్టీ పెద్దలు అనౌన్స్ చేస్తారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ విజయాలతో జోరుమీదున్న కమలం పార్టీలో కొత్త అధ్యక్షుడు నియామకం ఆసక్తిని పెంచుతోంది. ఈ విషయంలో చాలా కాలంగా ఏకాభిప్రాయం కోసం ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ.. సుదీర్ఘ కసరత్తు, సంప్రదింపుల అనంతరం కొత్త అధ్యక్షుడి పేరును నెలాఖరు లోపు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర నేతలకు ఇప్పటికే అమిత్ షా టార్గెట్ విధించారు.

ఇటీవల తనతో భేటీ అయిన రాష్ట్ర నేతలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం తద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే టార్గెట్ గా పెట్టుకోవాలని స్టేట్ లీడర్స్ కు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీజేపీకి కొత్త బాస్ నియామక ప్రక్రియ జరిగిపోతే ఇక కాంగ్రెస్, బీఆర్ఎస్ పై బీజేపీ సరికొత్త ఉత్సాహంతో రాజకీయం సాగించనుందనే చర్చ జరుగుతోంది.

# రీ ఎంట్రీకి రెడీ అవుతున్న తెలుగుదేశం పార్టీ

తెలంగాణలో తెలుగుదేశం పార్టీ రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయింది. ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన టీడీపీ తెలంగాణలోనూ తన గత వైభవాన్ని చాటు దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తున్నట్లు తెలిసింది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల తెలంగాణ టీడీపీ నేతల సమావేశంలో ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు. నేతలు సిద్ధంగా ఉండాలని, త్వరలోనే తెలంగాణ నేతలతో హైదరాబాద్ లో సమావేశం ఏర్పాటు చేస్తానని, ఆ సమావేశంలో పార్టీ బలోపేతం చేయడంపై తగిన సూచనలు చేయనున్నట్లు తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం. తెలుగుదేశం పార్టీ జాతీయ పార్టీ కావడంతో తెలంగాణలోనూ తన ప్రాముఖ్యతను నిలబెట్టుకోవాలని భావిస్తుంది.



**కొంత సమయాన్ని...** రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ పైనే ఫోకస్ పెట్టింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలసి కూటమిగా తెలంగాణలో పోటీ చేసినప్పటికీ అనుకున్న విజయాలు సాధించలేకపోయింది. ఖమ్మం జిల్లాలో మాత్రమే కొన్నిసీట్లు సాధించడం, ఆ పార్టీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరిపోవడంతో ఈసారి యువతరానికి సీట్లు కేటాయించాలన్న నిర్ణయానికి వచ్చారు. పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించి వారికి పదవులు ఇవ్వడమేకాకుండా తగిన ప్రాధాన్యత ఇస్తామన్న హామీతో పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన కార్యాచరణ పథకాన్ని రూపొందించాలని ఇప్పటికే సీనియర్ నేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

**వీడిన నేతలను...** తెలంగాణలో నేతలు పార్టీని వీడినా క్యాడర్ ఉందని పార్టీ నాయకత్వం బలంగా నమ్ముతుంది. దీంతో పాటు బలమైన ఓటు బ్యాంకు కూడా ఉందని భావిస్తుంది. హైదరాబాద్ నగరంతో పాటు ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో కూడా ఓటు బ్యాంకు ఉందని గుర్తించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వం ముఖ్యమైన నియోజకవర్గాలను గుర్తించి అందులోనే పోటీ చేసి అక్కడ గెలిచి కనీస స్థానాల్లో పసుపు జెండా ఎగరేలా చూడాలని చంద్రబాబునాయుడు భావిస్తున్నారు. దీంతో పాటు గతంలో పార్టీని వీడిపోయిన నేతలను తిరిగి రప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన సీనియర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

**ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో...** మరొకవైపు అసెంబ్లీ ఎన్నిలకు ఇంకా సమయం ఉన్నందున ముందుగా వచ్చే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయాలని దాదాపుగా టీడీపీ నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఒంటరిగా పోటీ చేయకుండా ఏపీ తరహాలోనే తెలంగాణాలోనూ బీజేపీ, జనసేనతో కలసి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసి మంచి ఫలితాలు సాధించాలన్న ఉద్దేశ్యంతో అధినేత ఉన్నారు. తక్కువ స్థానాల్లో పోటీ చేసినా హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ ఉండేలా చూసుకోగలిగితే పార్టీ ఇమేజ్ మళ్లీ పెరిగి ఓటర్లు తిరిగి పార్టీ వైపు చూస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతుండటంతో ఆ దిశగానే ప్రయత్నాలను ప్రారంభించినట్లు తెలిసింది. ఎటూ బీజేపీ కిఉన్నబలంతో టీడీపీ, జనసేన ఓటు బ్యాంకు కలిస్తే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని నమ్ముతుంది. సో.. త్వరలోనే టీడీపీతెలంగాణలో రీ ఎంట్రీ ఇవ్వబోతుంది.



## ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం నూతన పాలసీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం పాలసీ తయారు చేయాలని విద్యాశాఖను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఆచరణ సాధ్యమయ్యేలా పాలసీ ఉండాలని సూచించారు. విద్యా కమిషన్, విద్యాశాఖపై శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ప్రాథమిక విద్య స్థాయిలో ఎలాంటి సంస్కరణలు అవసరమన్న అంశంపై చర్చించారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఎలాంటి విధానాలు అమలు చేస్తున్నారన్నదానిపై విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. జీవన ప్రమాణాలు పెంచే విధంగా విద్యావిధానం ఉండాలని అధికారులకు సూచించారు. భాషతోపాటు, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరిగేలా ఈ పాలసీ ఉండాలన్నారు. ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం ఎంత ఖర్చయినా కాంగ్రెస్ ప్రభుత్వం వెనకాడబోదన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ పలు కీలక సూచనలు చేశారు. విద్యా వ్యవస్థలో 1960 నుంచి చోటు చేసుకున్న మార్పులు ఏవిధంగా నష్టం కలిగించాయో వివరించారు. బోధన ప్రమాణాలు ఏవిధంగా ఉండాలన్న దానిపై పలు సూచనలు చేశారు.

ఆయనతోపాటు సీనియర్ నేత కె.కేశవరావు కూడా కొన్ని సూచలను చేశారు. వీటన్నింటినీ క్రోడీకరిస్తూ ఆచరణయోగ్యమైన పాలసీని తయారు చేయాలని సీఎం విద్యాశాఖను ఆదేశించారు.




## మోడీ - షా డిసైడ్ అయితే...

# వార్ వన్‌సైడే!

## వక్ఫ్ బిల్లుకు ఆమోదం.. మోదీ-షా స్కెచ్ వేస్తే ఇట్లుంటది

మోడీ సర్కారు అనుకున్నది సాధించింది. అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వివాదాలకు దారితీసిన వక్ఫ్ (సవరణ) బిల్లు-2025పై ఎట్టకేలకు ఆమోదముద్ర వేయించుకుంది.

ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. రాజ్యసభలో గురువారం అర్ధరాత్రి దాటే వరకు దీని మీద ఫుల్ డిస్కషన్ నడిచింది. విమర్శలు, ప్రతి విమర్శలతో సభ దద్దరిల్లింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు జవాబుల తర్వాత సవరణల వారీగా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు మద్దతుగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటు వేశారు. అదే లోక్‌సభలో బిల్లుకు అనుకూలంగా 288, వ్యతిరేకంగా 232 ఓట్లు వచ్చాయి.

**12 గంటల పాటు అక్కడే..** దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసిన వక్ఫ్ బిల్లు ఆమోదంతో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. వీళ్లు ఘటికులని.. అనుకున్నది సాధించే వరకు అస్సలు విశ్రమించరని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ మెచ్చుకుంటున్నారు. రాజ్యసభలో బిల్లు వీగిపోకుండా ఉండేందుకు బిజూ జనతాదళ్ (బీజేడీ)ను ఒప్పించడం అదుర్స్ అని అంటున్నారు.

12 గంటల పాటు ఉభయ సభలకు అమిత్ షా హాజరై.. ప్రతిదీ ప్లాన్ ప్రకారం జరిగేలా చూసుకోవడం బాగుందని చెబుతున్నారు. ఎన్‌డీఏ సభ్యులతో పాటు ఇతర పార్టీల ఎంపీల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించడం, బీజేడీ సభ్యులను దారికి తెచ్చుకోవడం, ఏకబిగిన పార్లమెంట్‌లోనే కూర్చొని బిల్లుకు ఆమోదముద్ర పడేవరకు పక్కకు జరగకపోవడం, విపక్షాల ప్లాన్స్‌ను తిప్పికొట్టడం.. ఇదంతా షా వ్యూహాలకు తిరుగులేదని మరోమారు రుజువు చేసిందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ప్రధాని మోదీ థాయ్‌లాండ్ పర్యటనలో బిజీగా ఉన్నారు.

ఈ తరుణంలో ఉభయ సభల్లో షా అంతా తానై నడిపించారు. మొదట అనుకున్న ప్లాన్ ప్రకారం వక్ఫ్ బిల్లును పక్కా స్కెచ్‌తో ఆమోదించుకోవడం హైలైట్ అని మెచ్చుకుంటున్నారు.

## సంపాదకీయం

# మోడీ రాహుల్.. ఒకటే వ్యూహమా ?

దేశమంతా అతి పెద్ద చర్చగా ఇంకా చెప్పాలంటే రచ్చగా మారిన వక్ఫ్ సవరణ బిల్లు 2025 మీద పార్లమెంట్ లో రెండు రోజుల పాటు చర్చ సాగింది. అయితే ఇంతటి కీలకమైన చర్చలో కనిపించని ఇద్దరు దిగ్గజ నేతల గురించి అంతా చర్చిస్తున్నారు. ఆ ఇద్దరే ప్రధాని నరేంద్ర మోడీ. లోక్ సభలో అపోజిషన్ లీడర్ రాహుల్ గాంధీ. ఈ బిల్లు ఏప్రిల్ 2న లోక్ సభ లో చర్చకు వచ్చింది. మొదట ఎనిమిది గంటలు అనుకుంటే అది కాస్తా అర్ధరాత్రి దాకా సాగింది. లోక్ సభలో చర్చలో ప్రధాని మోడీ కనిపించలేదు. ఇక కాంగ్రెస్ వైపు నుంచి చూస్తే ఎంతో మంది నాయకులు మాట్లాడారు కానీ రాహుల్ గాంధీ రాలేదు. ఇక ఆయన సోదరి వాయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ కూడా సభలో లేరు. ఇక దీనికంటే ముందు లోక్ సభలో వక్ఫ్ బిల్లు మీద చర్చ ఉందని తెలిసి ఎలాంటి వ్యూహం అనుసరించాలి అన్న దాని మీద కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించింది. ఆ సమావేశంలో పాల్గొని వ్యూహ రచన చేసిన రాహుల్ తీరా సభలో మాత్రం తన వాయిస్ వినిపించలేదు. తన చెల్లెలు వాయిస్ కూడా వినపడలేదు. ఎటూ లోక్ సభలో ఈ బిల్లు ఈజీగా పాస్ అవుతుందని ఆలోచించి ఆయన రాలేదా అన్న చర్చ కూడా ఉంది. మరో వైపు చూస్తే ప్రధాని నరేంద్ర మోడీ కూడా కనిపించలేదు. మొత్తం భారమంతా తన మీద వేసుకుని హోం మంత్రి అమిత్ షా విపక్షాలను నిలువరిస్తూ కనిపించారు. లోక్ సభలో బిల్లుకు అనుకూలంగా 288 ఓట్లు వస్తే వ్యతిరేకంగా 232 ఓట్లు వచ్చాయి. అంటే భారీ మెజారిటీతో బిల్లు నెగ్గింది. ఇక రాజ్యసభలో కూడా చూస్తే సోనియా గాంధీ హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొన్నారు. కానీ బిల్లు మీద సోనియా మాట్లాడలేదు ఖర్గే తదితరులు మాట్లాడారు. సోనియా పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడి ఎన్డీయే ప్రభుత్వం మీద విమర్శలు చేస్తే రాహుల్ గాంధీ ట్విట్టర్ ద్వారానే కేంద్ర ప్రభుత్వ తీరుని ఎండగట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ అయితే థాయిలాండ్ టూర్ కి వెళ్ళిపోయారు. మరి వక్ఫ్ బిల్లు దేశంలోని ఇరవై కోట్ల మందికి సంబంధించిన అంశం కదా ఎందుకు ఇలా అంటే అధికార విపక్షాల అధినేతల వ్యూహాలు ఇవే అని అంటున్నారు. మాట్లాడటం కాదు మాట్లాడకపోవడమూ ఒక వ్యూహమే అని అంటున్నారు.

## 600 సీసీ కెమెరాల పుటేజ్ ను పరిశీలించి మరి...

# మంగళసూత్రం చోరీ కేసును ఛేదించిన శామీర్ పేట పోలీసులు




శామీర్ పేట గరుడ వార్త) లిఫ్ట్ ఇస్తానంటూ నమ్మబలికి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు మంగళసూత్రం చోరీ చేసిన దొంగను పట్టుకున్న శామీర్ పేట పోలీసులు శుక్రవారం రిమాండ్ కు తరలించారు. శామీర్ పేట పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు శుక్రవారం చోరీకి సంబంధిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ కీసర మండలం ధర్మవరం తోటకు చెందిన వృద్ధురాలు వరలక్ష్మీ తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయంజాల్ లో తన పెన్షన్ తీసుకునేందుకు తన మనవడి కారులో వెళ్ళింది. తిరుగు ప్రయాణంలో దొంగల మైసమ్మ వరకు బస్సులో వచ్చి అక్కడ ఆటో కొరకు వేచి ఉంది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలికి అడ్డగుట్టకు చెందిన పంది నరేష్ కుమార్ (42) తన బైక్ పై లిఫ్ట్ ఇస్తానని చెప్పి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెళ్ళాడు. మార్గమధ్యలోని ఓ నిర్మానుష్యమైన వెంచర్ లోకి తీసుకెళ్లాడు. వెంచర్లో బైక్ ఆపి ఫోన్ మాట్లాడుతుండగా అనుమానం వచ్చి వృద్ధురాలు అక్కడి నుంచి వెళ్లడానికి ప్రయత్నించింది. ఆ సమయంలో నరేష్ ఆమె కిందకు తోసి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయాడు. బాధితురాలు శామీర్ పేట పోలీస్లకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు పిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి దాదాపు 600 సీసీ కెమరాల పుటేజీలు పరిశీలించారు. సిసి ఫుటేజ్ ఆధారంగా నింధితుడిని అదుపులోకి తీసుకున్నారు. నింధితుడిని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. నింధితుడి వద్ద నుంచి చోరీ చేసిన రెండు తులాల మంగళసూత్రం తో పాటు ఒక సెల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి వెల్లడించారు. కేసును ఛేదించిన పోలీసులను సిసిఎస్ పోలీసులు, ఎస్వోటీ పోలీసులను సిపి తో పాటు మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి అభినందించారని, రివార్డు సైతం అందించనున్నట్లు ఏసిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, డిఐ గంగాధర్, సిసిఎస్, ఎస్ఓటి పోలీసులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికై విరాళం అందజేసిన మాజీ ఎంపీటీసీ



శామీర్ పేట, (గరుడ వార్త) మజీద్పూర్ గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి విరాళం అందజేశారు. శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి శుక్రవారం ఒక లక్ష ఏడు వేల రూపాయలను గౌడ సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్బంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా విరాళం అందజేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు ఆలయ నిర్మాణనికి తోడ్పాటు అందించాలని అయన కోరారు. విరాళం అందజేసిన అశోక్ రెడ్డికి గౌడ సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్బాగౌని జగదీష్ గౌడ్, అబ్బాగౌని భాస్కర్ గౌడ్, గిర్మాపురం నర్సింగ్ రావు గౌడ్, అబ్బాగౌని వెంకటయ్య గౌడ్, అబ్బాగౌని లింగమయ్య గౌడ్, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్వహణ కొరవడి.. వనాలు మాయమై



జగిత్యాల : పల్లెలను హరిత గ్రామాలుగా మార్చడంతోపాటు ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేమితో ఎండిపోతున్నాయి. జిల్లాలో 380 పంచాయతీలతోపాటు అనుబంధ గ్రామాలను కలుపుకొని 417 గ్రామాల్లో 421 ఎకరాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయగా, 57 ప్రాంతాల్లో కోతులకు ఆహార ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో బృహత్ పల్లె ప్రకృతి వనాలు 65 ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా ప్రతి గ్రామానికి వేయి మొక్కల చొప్పున జిల్లా వ్యాప్తంగా 3.80 లక్షల మొక్కలను నాటారు. అలాగే 'మేరీ మిట్టి– మేరీ దేశ్'లో భాగంగా అమర జవాన్లు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు ప్రతి పంచాయతీలో 75 మొక్కలతో వనాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో ఎక్కడా మొక్కలు పూర్తి స్థాయిలో కనిపించడంలేదు.

**ప్రజాధనం వృథా**మండలంలోని 18 పంచాయతీలలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయగా ఒకట్రెండు మినహా ఎక్కడా వనాలు కనిపించడంలేదు. ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిన సమయంలో ఆర్భాటంగా మొక్కలు నాటడమే కాకుండా పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పచ్చదనం కనిపించింది. ప్రస్తుతం పలు వనాల్లో మొక్కలు కూడా కనపడకుండా పోయాయి. ఒక్కో వనం పేరుతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అయింది.

**పేరుకుపోతున్న చెత్తాచెదారం** మండలంలోని గ్రామాల్లో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఎక్కడిచెత్త అక్కడే ఉంటుండడంతో పాటు నడక ట్రాకింగ్‌లు రూపు రేఖలు కోల్పోతున్నాయి. కొన్ని వనాల చుట్టూ ఏర్పాటు చేసిన హద్దులు విరిగి పోయాయి. వేసవి ప్రారంభం కావడంతో నీటిని అందించక పోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి.

**నిధుల కొరత**

జగిత్యాల అర్బన్, గ్రామీణ మండలాల్లోని 34 గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పంచాయతీల నిర్వహణ లేకపోవడంతో సగానికిపైగా వనాలు కనిపించకుండా పోయాయి. పంచాయతీలకు నిధుల కొరతతో నీరు అందించలేక ఎండిపోతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యం**

మండలంలోని 15 గ్రామపంచాయతీలలో ఉపాధిహామీ పథకంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందట వరకు నిర్వహణ బాధ్యతలను ఉపాధిహామీ ఆధ్వర్యంలో చేపట్టేవారు. తర్వాత నిర్వహణను గ్రామపంచాయతీలకు అప్పగించారు. గ్రామపంచాయతీలలో నిధుల కొరత, పంచాయతీ అధికారుల అలసత్వంతో పకృతి వనాలను పట్టించుకోవడం లేదు. దీంతో చాలాచోట్ల మొక్కలకు నీటిని పట్టకపోవడంతో ఎండిపోతున్నారు.

**గ్రామాలకు దూరంగా..**

మండలంలోని 23 పంచాయతీల పరిధిలో నిర్మించిన పల్లెప్రకృతి వనాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఒబులాపూర్‌లో గ్రామానికి దూరంగా సోమేశ్వర ఫిల్టర్‌బెడ్‌లో ఏర్పాటుచేసిన పల్లెప్రకృతి వనం ఇప్పటికీ ఉపయోగించిన దాఖలాలు లేవు. మల్లాపూర్‌లో శ్మశానవాటిక కింద నిర్మించగా ఆటు వైపు ఎవరూ వెళ్లడంలేదు. సగానికి పైగా వనాలను గ్రామాలకు దూరంగా నిర్మించడంతో ఉపయోగంలోకి రాకుండా పోతున్నాయి.

# భవితకు మరింత భరోసా

భువనగిరి : ప్రత్యేక అవసరాలు కలిగిన 0–18 ఏళ్లలోపు వారికి ఆటపాటలతో విద్య అందించేందుకు ప్రభుత్వం విలీన విద్యా వనరుల (భవిత) కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పాఠశాల స్థాయి వయసు కలిగిన వారికి భవిత కేంద్రాల్లో, 15 ఏళ్లు పైబడ్డ వారికి కళాశాలల్లో ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పించడం, మాట్లాడటం, నడిపించడం వంటి వాటితోపాటు వారిని శారీరకంగా మానసికంగా ఆరోగ్యవంతంగా మార్చేందుకు కృషి జరుగుతోంది. ఇందుకోసం నిపుణులను మండలానికి ఒకరిని చొప్పున నియమించి సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి, తదితర వాటిని అప్పట్లో కొంతమేర సమకూర్చారు. అయితే సుమారు 10 ఏళ్ల తరువాత తాజాగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపిక చేసిన వాటిలో సొంత భవనాలు కలిగిన వాటికి వివిధ పరికరాల కోసం ఒక్కో కేంద్రానికి రూ.2లక్షల చొప్పున కేటాయించింది.

**పరికరాల కొనుగోలు..**

ప్రభుత్వ నిర్ణయంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అయిదు కేంద్రాలకు రూ.10 లక్షలు విలువ చేసే సామగ్రి అందుబాటులోకి రానుంది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధనోపకరణాలు, ఐఈఆర్పీలకు కుర్చీలు, చికిత్స అందించే బల్లలు, మసాజ్ బాల్, డంబుల్స్, రౌండ్‌టేబుల్, అల్మారాలు తదితర 115 రకాల వాటిని సమకూర్చేలా మార్గనిర్దేశం చేశారు. ఈ నిధులతో ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, భవిత కేంద్రం అనుసంధానంగా ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల కమిటీ నేతృత్వంలో వీటిని సమకూర్చనున్నారు.

జిల్లాలోని ఐదు భవిత కేంద్రాలకు ఆయా పరికరాల కొనుగోలుకు రూ.2లక్షల చొప్పున మంజూరు కావడంతో రానున్న రోజుల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఆటపాటల విద్యా సహకారం మరింత మెరుగయ్యే అవకాశం ఉంటుందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త పెసరు లింగారెడ్డి కు తెలిపారు.

కేంద్రాల వివరాలు..

ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్, మోత్కూరు, రామన్నపేట

# దిగువకు పాతాలగంగ

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గత నెలతో పోలిస్తే జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లో సగటున 2.45 నుంచి 1.54 మీటర్ల మేర దిగువకు పడిపోయాయి. జిల్లా భూగర్భ జలశాఖ తాజా నివేదిక దీనిని స్పష్టం చేస్తోంది. మరోవైపు గత నాలుగు రోజులుగా సగటున 36.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణం కంటే మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు మరింత వేగంగా లోతుకు పడిపోయే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో యాసంగి వరి 1.77 లక్షల ఎకరాలు.. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, కూరగాయలు కలిపి నాలుగు వేల ఎకరాల్లో సాగయ్యాయి. గతేడాదితో పోల్చితే వరిసాగు 20 వేల ఎకరాలు పెరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వరి పంటకు ఈ రెండు నెలలు కీలకం. పొట్టదశలో కంకులు పాలుపోసుకుంటాయి. ఇప్పుడు నీటి తడులు ఎక్కువ అందిస్తే... దానికి తగ్గట్టుగా దిగుబడి పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంత మేర నీటి లభ్యత కనిపించడం లేదు.

మధ్యమానేరులో 15.95 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడి నుంచి దిగువమానేరు, కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ జలాశయం నుంచి ఇల్లంతకుంట మండలంలోని చెరువులను నింపారు. ఎగువమానేరులోకి మల్లన్నసాగర్‌నుంచి గత నెలలోనే 0.5 టీఎంసీల నీటిని తరలించారు. ఆయా కాల్వల పరిధిలోని ఆయకట్టు మినహా మిగతా ప్రాంతమంతా బోరుబావులే ఆధారం. మెట్టప్రాంతం కావడంతో భూగర్భజలాలు వేగంగా తగ్గుతున్నాయి. దీని ప్రభావం సాగుచేసిన పంటలపై పడుతోంది. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో బోరు బావుల నుంచి అన్నదాతలు



నిరంతరం నీటిని తోడుతున్నారు. ఈ ఏడాది తక్కువ రోజుల్లో ఎక్కువ వర్షాలు కురవడంతో భూగర్భంలోకి తక్కువ నీరు ఇంకింది. ఫలితంగా భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.


నాకున్న 2.20 ఎకరాలకు తోడు పక్కనే ఉన్న మరో 2.20 ఎకరాలను కౌలుకు తీసుకుని మొత్తం వరి సాగు చేశా. ఇందులో రెండు వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. గత నెలరోజుల్లో రెండు బోరుబావుల్లో నీటి మట్టం పడిపోయింది. పొట్టదశ సమయంలో మూడెకరాలు పూర్తిగా ఎండిపోయింది. మిగిలిన రెండెకరాల్లో పంట పూర్తిగా చేతికొచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. మాది మల్కపేట జలాశయం దిగువన కిలోమీటరు పరిధిలో ఉన్న గ్రామం. జలాశయంలో నీరు నింపితే చుట్టూ ఉన్న గ్రామాల్లో భూగర్భజలాలు నిలకడగా ఉండే అవకాశం ఉంది. పొన్నం లింగం, రైతు వెంకట్రావుపేట, కోనరావుపేట మండలం

# బాల బడులు.. కనీస వసతులు కరవు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని బీసీ కాలనీలో మూడో అంగన్‌వాడీ కేంద్రం ఇది. ఇందులో 18 మంది చిన్నారులు ఉండగా 8 మంది గర్భిణులు, ఆరుగురు బాలింతలు లబ్ధిపొందుతున్నారు. సొంత భవనం ఉంది. శౌచాలయం ఉన్నా దానికి నీటి సరఫరా లేదు. కనీసం పిల్లలు గొంతు తడుపుకునేం దుకైనా తాగునీరు మృగ్యమైంది. బయట ఉన్న ట్యాంకు నుంచి బిందెలతో నీళ్లు తీసుకొస్తే చిన్నారులు చేతులు శుభ్రపరచుకోవాల్సిన పరిస్థితి. విద్యుత్తు సౌకర్యం లేదు. ఎండలు, ఉక్కపోత పెరుగుతున్న దృష్ట్యా తన సొంత ఖర్చులతో విద్యుత్తు తీగలను అమర్చి, ఫ్యాన్‌కు మరమ్మతు చేయించేందుకు ఇప్పటికే ఎలక్ట్రీషియన్‌తో మాట్లాడినట్లు అంగన్‌వాడీ టీచర్ జి.లావణ్య తెలిపారు.

**చిన్నారులకు తప్పని ఇబ్బందులు**

మాతా శిశుసంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, 0 నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. కాగా పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్)పరిధిలో మొత్తం 587 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కొన్ని కేంద్రాలు సొంత భవనంలో నడుస్తుండగా మరికొన్ని అద్దె ఇళ్లు, పాఠశాలల గదుల్లో కొనసాగు తున్నాయి. అనేక కేంద్రాల్లో కనీస వసతులు మృగ్యమయ్యాయి. శౌచాలయాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. శౌచాలయాలున్న కేంద్రాల్లో నీటి సరఫరా లేకపోవడం వల్ల వాటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. అనేక కేంద్రాల్లో విద్యుత్తు కనెక్షన్లు,



ఫ్యాన్లు లేకపోవడంతో ప్రస్తుత వేసవిలో ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీల నుంచి 15 శాతం బడ్జెట్‌ను కేటాయించి అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాల్సి ఉన్నా, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల్లో 6 మాసాల నుంచి 3 సంవత్సరాల వయసు చిన్నారులు 18,838 మంది, 4020 మంది గర్భిణులు, 2533 మంది బాలింతలు, 15,374 మంది మూడు సంవత్సరాల నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలు లబ్ధిపొందుతున్నారు.

**సౌకర్యాలు కల్పించాలి** అంగన్‌వాడీ కేంద్రానికి పగటిపూట వెళుతున్నాం. అక్కడ శౌచాలయం నిరుపయోగంగా ఉంది. ఫ్యాన్ నడవకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందిగా ఉంది. ఎండ తీవ్రత పెరగడంతో చిన్నారులు సైతం అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచి మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. వైష్ణవి, గర్భిణి, రాచర్ల బొప్పాపూర్

# కాసులకు కక్కుర్తి.. కడుపులోనే విచ్ఛిత్తి..!

నల్గొండ : ఆరు నెలల క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రం ఎంజీ రోడ్డులోని ఓ ఆసుపత్రిలో అబార్షన్లు చేస్తుండగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇద్దరు బాధితుల్ని పట్టుకున్నారు. అదే ప్రాంతంలోని మరో ఆసుపత్రిలో ఒకరిని పట్టుకున్నారు. వీరిపై అప్పటి అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఎనిమిది నెలలక్రితం నల్గొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఓ ఆసుపత్రిలో అబార్షన్‌లు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ స్కానింగ్ సెంటర్‌తో పాటు మరో రెండు సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఎక్కువశాతం మంది చదువుకున్నవారే కొన్ని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, స్త్రీవైద్య నిపుణులతో కలిసి పుట్టబోయేది ఎవరో తెలుసుకొని మరీ కానరాని లోకానికి పంపేస్తున్నారు. మరికొంత మంది పీఆర్‌వోలు, పీఎంపీలు మధ్యవర్తులుగా ఉండి కాసులకు కక్కుర్తి పడుతూ మహాలక్ష్మికి మరణ శాసనం లిఖిస్తున్నారు. దీంతో బాలబాలికల నిష్పత్తిలో పెద్ద ఎత్తున తేడా వస్తోంది. ఆయా ప్రాంతాల్లో



గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ రూ.40 నుంచి రూ.60 వేలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్, ఖమ్మం, జగ్గయ్యపేట ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడి వారితో కలిసి కొన్ని కేంద్రాలు ఏర్పాటు చేసుకొని చిన్న సూట్‌కేస్ సామర్థ్యం ఉన్న మిషన్లను తెప్పించి పరీక్షలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది.

**తగ్గుతున్న నిష్పత్తి**

నల్గొండ జిల్లాలో ప్రతి 1,000 మంది బాలురకు 923 మంది బాలికలు.. సూర్యాపేటలో 1,000కి 898 మంది.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,000 మందికి 912 మంది బాలికలున్నారు. పరిస్థితి ఇలా కొనసాగితే రానున్న రోజుల్లో కొన్ని మండలాల్లో దయనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని సంబంధిత అధికారులు వాపోతున్నారు. ప్రస్తుతం వైద్యఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం నల్గొండ జిల్లాలో 88, సూర్యాపేటలో 53, యాదాద్రి భువనగిరిలో 38 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వంద మందికి పైగా స్త్రీ వైద్య నిపుణులు పనిచేస్తున్నారు. స్కానింగ్ సెంటర్లలో వైద్యులు, సిబ్బంది ఉన్నారా లేదా అనేది గుర్తింపు సరిగ్గా జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**ముమ్మర తనిఖీలు..–డా.పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, నల్గొండ**

జిల్లాలో స్కానింగ్ సెంటర్లు, ప్రసవాలు నిర్వహించే ఆసుపత్రులు ముమ్మరంగా తనిఖీ చేస్తున్నాం. మధ్యవర్తులు, ఆర్‌ఎంపీలు, పీఎంపీలు లింగనిర్ధారణ పరీక్షలకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసుల సహకారంతో పీసీ్మ పీఎన్‌డీటి చట్టం పటిష్ఠంగా ఉండేలా చూస్తున్నాం. మొదటిసారి పట్టుబడితే మూడేళ్ల వరకు జైలు, రూ.10 వేల జరిమానా, రెండోసారి పట్టుబడితే ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా ఉంటుంది.

# గుట్టలు గుట్టలుగా అక్రమాలు!

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రకృతి అందాలకు చిరునామాగా నిలుస్తున్న మట్టిగుట్టలు ఏటా కరిగిపోతున్నాయి. అధికారుల ఉదాసీనత, అక్రమార్కుల కాసుల కక్కుర్తితో సహజవనరులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. స్థిరాస్తి వ్యాపారం, ప్రభుత్వ పనులు, రహదా రుల నిర్మాణాల పేరిట అనేకచోట్ల ఈ దందా సాగుతోంది. చాలాచోట్ల అనుమతులు తీసుకోకుండానే మట్టిని తరలిస్తుండటం గమనార్హం.

**అనుమతులు లేకుండానే..**

గుట్టలపై మట్టి తవ్వాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. సొంత భూముల్లోని మట్టిని తరలించాలన్నా రెవెన్యూ, గనులశాఖ అనుమతి ఉండాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం ప్రకారం గిరిజనులు మాత్రమే మట్టి తవ్వాలి. తొలుత ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. మైనింగ్, రెవెన్యూశాఖల అధికారులు సంయుక్తంగా సర్వే జరుపుతారు. ఎన్ని క్యూబిక్ మీటర్లు మట్టి తవ్వుకోవాలి.. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు మట్టి తీయొచ్చు అనే హద్దుల్ని సర్వే నంబర్ల ఆధారంగా నిర్ణయిస్తారు. లీజు గడువు ముగిశాక గుప్పెడు మట్టి కూడా తీయకూడదు. అయితే అనేకచోట్ల ఈ నిబంధనలు పాటించటం లేదు. ఎక్కడో ఓ సర్వే నంబర్‌లో తవ్వకాలకు అనుమతులు తీసుకుని.. ఇతర ప్రాంతాల్లోనూ మట్టిని తోడేస్తున్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ఫోన్‌లో సంప్రదించగా ఖమ్మం జిల్లా మైనింగ్ శాఖ అధికారి సాయినాథ్ అందుబాటులోకి రాలేదు.

ఎక్కడెక్కడంటే..ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో మట్టి తవ్వకాలు



జోరుగా సాగుతున్నాయి. రఘునాథపాలెం మండలం పీర్లగుట్ట, వెలుగుమట్ల, బాలపేట, మంచుకొండ, కోయచలకలోని గుట్టలన్నీ గుల్లగుల్లవుతున్నాయి. ఖమ్మం గ్రామీణం మండలం వెంకట గిరి, మద్దులపల్లి, గుర్రాలపాడు, ఏదులాపురం, పెద్దతండాలోని గుట్టలు కనుమరుగయ్యాయి. తెల్లారుపల్లి, ఆరెకోడు, చింతపల్లిలో గుట్టలపై తవ్వకాలు సాగుతున్నాయి.

కొణిజర్ల మండలం తనికెళ్ల– తుమ్మలపల్లి, కారేపల్లి మండలం ముత్యాలగూడెం, బస్వాపురం, అత్తాయిగూడెం, పోలంపల్లిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఏన్కూరు, హిమాంనగర్, భద్రుతండా, జన్నారం, జూలూరుపాడు, పడమటి నర్సాపురంలో గుట్టలు ఆనవాళ్లు కోల్పోయాయి. సత్తుపల్లి మండలం రేజర్ల, గంగారం, కొత్తలంకపల్లి, పెనుబల్లి మండలంలో దేవతల గుట్టలు క్రమేణా తరుగుతున్నాయి.

అశ్వారావుపేట మండలం అల్లిగూడెం, వేదాంతపురం, దమ్మపేట మండలం మందలపల్లి, గట్టుగూడెం, ములకలపల్లి మండలం సీతారామ ప్రధాన కాల్వకు రెండువైపులా గుట్టల నుంచి రోజూ వందలకొద్దీ టిప్పర్ల మట్టి తరలిపోతోంది. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం, మొండితోగు గుట్టలు కరిగిపోయాయి. పాల్వంచ మండలం రాజాపురం, తోగ్గూడెం, పునుకుల, లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ గుట్టల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి.

# మూగజీవాల వేదన తీరేనా..!



ఎల్లారెడ్డిపేట : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలతో అనేక కుటుంబాలు వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందుతున్నాయి. గొర్రెలు, మేకలు, పాడిగేదెలు జీవనాధారాన్ని కల్పిస్తున్నాయి. అవి ఏదైనా జబ్బుబారిన పడితే మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. జిల్లాలోని పశువైద్యశాలలు అసౌకర్యాల నడుమ కునారిల్లుతున్నాయి. పశువైద్య కేంద్రాలను సౌకర్యాల లేమి వేధిస్తోంది. అనేక భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో సకాలంలో వైద్యం అందక పల్లెల్లో పశుపోషణ రైతులకు భారంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించేందుకు పశువైద్యశాలల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో పుశు సంపదను పరిశీలిస్తే గొర్రెలు– 3,10,581, మేకలు– 63,178, తెల్లపశువులు–35,055, గేదెలు–58,737, కోళ్లు– 6,09,969 ఉన్నాయి.

**భవనాలు శిథిలం**

సిరిసిల్లలోని ప్రాంతీయ పశువైద్యశాలతోపాటు జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రాథమిక పశువైద్యశాలలు, ఉపకేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2014లో మంజూరైన ఆర్‌ఐడీఎఫ్ కేంద్ర నిధులతో చందుర్తి, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో నాలుగు ఆసుపత్రులకు భవన నిర్మాణాలను పూర్తిచేశారు. తంగళ్లపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, కోనరావుపేట, రాచర్ల గొల్లపల్లి, గాలపల్లి, హన్మాజీపేట, నిజామాబాద్, మానాలలోని ప్రాథమిక పశువైద్యకేంద్రాలు, అలాగే కొత్తపల్లి, ఆవునూరు, పోత్గల్, బండలింగంపల్లి, వీర్నపల్లి, శాత్రాజుపల్లి, నూకలమర్రి, రుద్రవరం, సుద్దాల, ఎన్గల్, కోరెం, కొదురుపాక గ్రామాల్లోని ఉపకేంద్రాల భవనాలకు భారీగా మరమ్మతులు చేయాల్సి ఉంది. వీటిలో విద్యుత్తు, గేట్లు, తలుపులు, కిటికీలు, ప్రహరీలు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. కొన్ని మండలాల్లో ఇరుకైన గదులు, అరకొర వసతుల నడుమ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్నపాటి గదిలో నిర్వహిస్తున్న పశువైద్యశాల ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోనిది. ఇందులో సిబ్బందికి కనీస మౌలిక వసతులు లేవు. 2019లో రూ.4.60 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. నిధుల లేమితో స్లాబ్‌స్థాయిలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భవన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ప్రభుత్వం నుంచి అదనంగా నిధులు మంజూరు కావడం లేదు. నిర్మాణం పూర్తయితే పశువైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి.

శౌచాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు

నూతన భవనాలు, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టేందుకు నిధుల మంజూరు కోసం గత అయిదేళ్లుగా ప్రయత్నిస్తున్నాం. నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నాం. జిల్లాలోని 20 పశువైద్య శాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఒక్కో దవాఖానాకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.40 లక్షలను మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పనులు నెలరోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. వి.రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

# నీరు.. ఖరారు..!



సూర్యాపేట : పురపాలికల్లో వేసవి నీటి ప్రణాళికను ప్రకటించారు. గత నెలలో వార్డుల్లో సర్వే చేయించిన పుర సిబ్బంది నీటిపై ప్రత్యేక దృష్టిసారించింది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సమస్య లేకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

**19 పురపాలికలు.. రూ.2.30 కోట్లు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలకు వేసవి ప్రణాళికకు సాధారణ, అత్యవసర నిధుల నుంచి రూ.2.30 కోట్లు కేటాయించారు. తాగునీటి ఎద్దడి తీర్చేందుకు పురపాలికల్లో నిధులున్నప్పటికీ వాటిని ఖర్చుచేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. పుర అధికారులు కేటాయించిన నిధులను చేతి పంపుల మరమ్మతు, పవర్‌బోర్లు, తాగునీటి పైపులైన్, వాల్వ్ లీకేజీలు, కొత్తమోటారు కొనుగోలు చేయడం, తదితర వాటికి వినియోగించాల్సి ఉంటుంది. ఇటీవల పుర అధికారులు చేపట్టిన సర్వేలో ఎక్కువగా సమస్య ఉన్న వార్డులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**గత సమస్యలు దృష్టిలో ఉంచుకొని..**

గతేడాది వేసవిలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని పుర అధికారులు వేసవి ప్రణాళికను రూపొందించారు. ముఖ్యంగా శివారు కాలనీలకు ఏటా నీటి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ కాలనీలపై దృష్టిసారించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. బోర్లు వేయించడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం, నిలిచిన పైపులైన్ల వంటి మరమ్మతు చేపట్టి సరఫరాలో జాప్యం లేకుండా చూడనున్నారు.

పురపాలికల్లో వేసవి నీటి ప్రణాళికను ప్రకటించారు. గత నెలలో వార్డుల్లో సర్వే చేయించిన పుర సిబ్బంది నీటిపై ప్రత్యేక దృష్టిసారించింది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సమస్య లేకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

**19 పురపాలికలు.. రూ.2.30 కోట్లు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలకు వేసవి ప్రణాళికకు సాధారణ, అత్యవసర నిధుల నుంచి రూ.2.30 కోట్లు కేటాయించారు. తాగునీటి ఎద్దడి తీర్చేందుకు పురపాలికల్లో నిధులున్నప్పటికీ వాటిని ఖర్చుచేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. పుర అధికారులు కేటాయించిన నిధులను చేతి పంపుల మరమ్మతు, పవర్‌బోర్లు, తాగునీటి పైపులైన్, వాల్వ్ లీకేజీలు, కొత్తమోటారు కొనుగోలు చేయడం, తదితర వాటికి వినియోగించాల్సి ఉంటుంది. ఇటీవల పుర అధికారులు చేపట్టిన సర్వేలో ఎక్కువగా సమస్య ఉన్న వార్డులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**గత సమస్యలు దృష్టిలో ఉంచుకొని..**


గతేడాది వేసవిలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని పుర అధికారులు వేసవి ప్రణాళికను రూపొందించారు. ముఖ్యంగా శివారు కాలనీలకు ఏటా నీటి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ కాలనీలపై దృష్టిసారించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. బోర్లు వేయించడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం, నిలిచిన పైపులైన్ల వంటి మరమ్మతు చేపట్టి సరఫరాలో జాప్యం లేకుండా చూడనున్నారు.

**నీటి సమస్య రానివ్వం.. –శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట**

వేసవిలో పురపాలికల్లో నీటి సమస్య రానివ్వం. ప్రణాళిక ప్రకారం ఎక్కడ సమస్య ఉన్న వెంటనే పరిష్కరించి నీటి సరఫరా జరిగేలా చూస్తాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే వేసవి ప్రణాళికను అమలు చేస్తాం.

# ధాన్యం మింగేసి.. ధనాన్ని కక్కరేం..!

నల్గొండ : పౌరసరఫరాల శాఖతో సమీక్ష నిర్వహిస్తే మిల్లర్ల దగ్గర ఆనాటి ప్రభుత్వం రూ.21 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని తాకట్టు పెట్టినట్లు తేలింది. మిల్లర్లతో పలు సమావేశాలు నిర్వహించి ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం లెక్కలు బకాయిలు లేకుండా అప్పగించాలని ఆదేశించాం. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు అందజేసే ఉచిత దొడ్డు బియ్యాన్ని మిల్లర్లు కిలో రూ.10కి కొనుగోలు చేసి మరాడించినట్లు, రీసైక్లింగ్ చేసి రూ.30ల చొప్పున సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. ఈ దందాను గుర్తించి పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్ల విలువైన వడ్లను విక్రయించేందుకు టెండర్లు పిలిచి విక్రయం పెడితే రూ.3వేల కోట్ల వడ్లకు లెక్క తేలింది. ఇంకా రూ. 4వేల కోట్లకు లెక్కలు తేలలేదు. దీనికి మిల్లర్లు సహకరించడం లేదు. సాక్షాత్తూ.. ముఖ్యమంత్రి రైస్ మిల్లర్ల ఆగడాలపై బహిరంగ సభలో ప్రస్తావించారంటే వ్యవస్థీకృతంగా వీరంతా ఏ మేరకు వేళ్లూనికుని పోయారో అర్థం చేసుకోవచ్చు. అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల జాబితాను ఇటీవలే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జిల్లాల వారీగా సంబంధిత అధికారులకు సమాచారం అందించింది. బియ్యం మిల్లుల్లో యాసంగి ధాన్యం ఎంత నిల్వ ఉందో తేల్చేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టగా మిల్లర్ల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. ఏళ్ల తరబడి ధాన్యం తీసుకుని బియ్యం అప్పగించని మిల్లర్లను గుర్తించి చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. చాలా మిల్లుల్లో గత యాసంగి ధాన్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించుకున్నట్లు తేలింది. కస్టమ్ రైస్ మిల్లింగ్(సీఎంఆర్)గా మార్చేందుకు మిల్లులకు పంపిన ధాన్యాన్ని మిల్లర్లు ఇవ్వకుండా పక్కదారి పట్టించారు. తమ వద్దే బియ్యం ఉన్నట్లు మిల్లర్లు లెక్కలు చూపిస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో వడ్లు మిల్లర్ల వద్దే ఉన్నాయని భావించిన ప్రభుత్వం బహిరంగ వేలం టెండర్లను



ఆహ్వానించి విక్రయించాలని నిర్ణయించింది.

మిల్లుల్లో యాసంగి ధాన్య నిల్వలు ఎన్ని ఉన్నాయో లెక్కలు తేల్చేందుకు అధికారులు తనిఖీలు చేపట్టగా ధాన్యాన్ని ఇష్టారాజ్యంగా విక్రయించుకున్నట్లు విచారణలో తేలింది. సంవత్సరాల తరబడి సీఎంఆర్ నిర్దేశిత లక్ష్యం పూర్తి చేయని మిల్లుల్లో ప్రభుత్వం అప్పగించిన ధాన్యం నిల్వలు లేవని అధికారులు గుర్తించి కేసులు నమోదు చేయించారు.

సూర్యాపేట జిల్లాలో 19 మిల్లుల్లో ధాన్యం లేదని గుర్తించారు. ఆరు మిల్లులపై రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) చట్టం కింద కేసులు నమోదు చేశారు. మిగిలిన 13 మిల్లులకు 25 శాతం జరిమానాతో చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లు కొందరు బినామీ పేర్లతో కొత్తగా మిల్లులు ఏర్పాటు చేసుకుని సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించేలా చేసుకోగా పూర్తిస్థాయిలో లెక్కలు తేల్చాల్సి ఉంది. నల్గొండ జిల్లాలో 12 మిల్లులు, యాదాద్రి భువనగిరిలో 6 మిల్లుల్లో ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు.

# గల్లా పెట్టెలో.. గలగలలేవీ..!

నల్గొండ : నిధుల లేమితో నీరసిస్తున్న పురపాలికలకు ఆస్తిపన్నుల రూపంలో కాస్త ఊపిరివచ్చింది. ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రజలు పన్నులు చెల్లించకపోవడంతో జిల్లాలోని పురపాలికల్లో అభివృద్ధి పనులకు కాసులు లేక కార్మికులకు వేతనాలు చెల్లించలేని స్థితికి చేరాయి. వందశాతం వసూలే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా లక్ష్యం చేరలేదు. దీంతో ప్రభుత్వం మార్చి 31 లోపు చెల్లించన వారికి వడ్డీపై 90 శాతం రాయితీ ప్రకటించడంతో మొండి బకాయిదారుల్లో కాస్త చలనం వచ్చింది. పురపాలికలకు రూ.కోట్లల్లో ఆదాయం వచ్చి చేరింది.

నల్గొండ జిల్లా పరిధిలో 8 పురపాలికలు ఉండగా అందులో హాలియా మినహా మిగతా పట్టణాల్లో ఏరియర్స్‌తో కలిపి రూ.82.66కోట్ల వరకు ఆస్తి పన్నులు రావాల్సి ఉంది. కానీ లక్ష్యాలను అధికారులు చేరుకోలేక పోయారు. పెద్ద మొత్తంలో ప్రభుత్వ శాఖలకు చెందిన భవనాల ఆస్తి పన్నులు పేరుకుపోయాయి. ప్రైవేట్ ఆస్తుల నుంచి పన్ను వసూలు చేసేందుకు విస్తృతంగా ఇంటింటికీ తిరగడం, జప్తులు చేయడం.. వడ్డీపై 90 శాతం మాఫీ చేయడంతో కొంత వరకు వసూలు అయ్యాయి. దీంతో పురపాలికల ఖాతాల్లో రూ.36.06కోట్లు జమ అయ్యాయి. ఇంకా 46.60 కోట్లు బకాయిలు ఉన్నాయి. నల్గొండ పురపాలికలో పరిశీలిస్తే గతేడాది ఆస్తి పన్ను డిమాండ్ రూ.17కోట్లు ఉండగా అధికారులు రూ.16కోట్ల ఆస్తి పన్నులు వసూలు చేశారు. కానీ ప్రభుత్వ భవనాల ఆస్తి పన్ను రూ.13కోట్లతో కలిసి ఏరియర్స్ మొండి బకాయిలు సుమారు రూ.30కోట్ల పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఇక్కడ వసూళ్ల శాతం తక్కువగా కనిపిస్తోంది.

# పూర్తికాని టెండర్.. ప్రజలకు ఫికర్

ఇంద్రవెల్లి : ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాలకు పదేళ్ల కిందటి వరకు తారు రోడ్డు సౌకర్యం ఉండేది. అనంతరం అవి అధ్వానంగా మారాయి. ఏళ్లుగా మారుమూల గిరిజన గ్రామాల తారు రోడ్ల పరిస్థితి, గిరిజనుల రాకపోకలకు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్పందించి ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖలు పంపడంతో ప్రభుత్వం జనవరిలో ప్రత్యేకంగా రూ.36.31 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదు. వర్షాకాలంలోగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు టెండర్లు పిలిచి తారు రోడ్ల పనులు పూర్తి చేయించాలని, లేకుంటే మరో ఏడాది పాటు ఇబ్బందులు పడాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు.

**53.37 కి.మీ.లకు.. రూ.36.31 కోట్లు మంజూరు**

ఉట్నూరు ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, ఉట్నూరు మండలాల పరిధిలోని 53.37 కి.మీ తారురోడ్ల మరమ్మతులకు 24.01.2025న ప్రభుత్వం జీఓ 59ని విడుదల చేసింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని జీఓలో పేర్కొంది. అయినా ఆ ప్రక్రియ ఇంత వరకు పూర్తి కాలేదు. ఇంద్రవెల్లి మండల కేంద్రం నుంచి వడ్‌గాం రహదారికి ప్రభుత్వం రూ.8.97 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డు పనులతో పాటు ముత్నూరు నుంచి సిరికొండ మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న కేస్లాపూర్ నుంచి కోయల్‌పాండ్రి రోడ్డు మరమ్మతులకు రూ.3.80 కోట్లు మంజూరు చేసింది. ముందుగా ఈ రోడ్లతో పాటు ఇంద్రవెల్లి నుంచి ఆదిలాబాద్ గ్రామీణ మండలం పరిధిలోని చిద్దరి ఖానాపూర్, ఇంద్రవెల్లి నుంచి ఉట్నూరు మండలం నర్సాపూర్ (బి) నుంచి దొడందా, గట్టెపల్లి పంచాయతీల రోడ్డు పనులను వచ్చే వర్షాకాలంలోగా మరమ్మతులు చేయకుంటే గిరిజనులు బాహ్యప్రపంచానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు. ఈ విషయమై ఉట్నూరు డిప్యూటీ ఈఈ పవార్ రమేష్ మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి, ఉట్నూరు మండలాలలోని 8 తారు రోడ్ల మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలను ఈఎన్‌సీకి అందించామన్నారు. ఈఎన్‌సీ అధికారులు టెండర్లను పిలిస్తే గుత్తేదారులు పనులు చేస్తారన్నారు.

# అంతా హడావుడి.. పర్యవేక్షణ లేమి!

ఆసిఫాబాద్: ప్రతి సంవత్సరం ఉపాధిహామీ కింద సీసీ రోడ్లకు రూ.కోట్లలో నిధులు విడుదల కావడం, మార్చిలోనే, అదీ చివరి పక్షం రోజుల్లో హడావుడిగా మంజూరు చేయడం పరిపాటిగా మారింది. పనులు ప్రారంభించకున్నా.. పురోగతిలో ఉన్నాయని నివేదికలను రూపొందించారు. అయినా ఇంకా మొదలు పెట్టని పనుల విలువ రూ.7 కోట్లుగా ఉండటం గమనార్హం. వేల పనులు ఒకేసారి చేయడంతో పర్యవేక్షణ అటకెక్కుతోంది. స్థానికంగా లభించే ఇసుక, తగిన పాళ్లలో కలపని సిమెంటు, కంకర మిశ్రమం కారణంగా.. ఈ రోడ్లన్నీ స్వల్ప కాలంలోనే పగుళ్లు తేలి అధ్వానంగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీ రహదారుల నిర్మాణానికి రూ.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 1,105 రోడ్లను చేపడుతుండగా.. దాదాపు 900 వరకు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో సైతం చాలా వాటి పనులు మొదలు పెట్టకున్నా, పురోగతిలో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ రకంగా కెరమెరి, జైనూర్, లింగాపూర్, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో అధికంగా ఉన్నాయని తెలిసింది. రోడ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఆలస్యం చేసినందుకు ఇటీవల కలెక్టర్ వెంకటేష్ దోత్రే.. డీఆర్‌డీఏ పీడీ దత్తారాం, పీఆర్ ఈఈ ప్రభాకర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లను సైతం సోమవారం సస్పెండ్ చేశారు.

కమీషన్లమయం..నిధులను అధికార, ప్రతిపక్ష నేతలందరూ తలాకొంత తీసుకుని కార్యకర్తలకు కేటాయించారు. ఫిబ్రవరిలో రూ.11 కోట్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ వచ్చాయి. తొలుత వీటిని తీసుకోవడానికి గుత్తేదారులు పోటీపడ్డారు. 8 శాతం వరకు కమీషన్ ఉండగా, అనంతరం రహదారులు మంజూరు కావడం క్రమంగా పెరిగే కొద్దీ.. కమీషన్ 6, 5, 3, శాతం వరకు తగ్గుతూ వచ్చింది. చివరకు నేతలు రోడ్ల పనులు చేయండని కొందరిని పిలిచి మరీ ఇచ్చే పరిస్థితి నెలకొంది. నంబాలలోని గోలేంగూడలో రూ.45 లక్షలు వెచ్చించి వేస్తున్న రోడ్డు ఇది. నంబాల నుంచి దాదాపు కిలోమీటర్ దూరంలో గోలేంగూడ ఉండగా, ఒకవైపు సిమెంటు రోడ్డు ఉంది. మరోవైపు నుంచి నంబాలకు రావడానికి ప్రస్తుతం కొత్త రోడ్డు వేస్తున్నారు. కొంత మేర పూర్తి కాగా క్యూరింగ్ సరిగా చేయడం లేదు. మరోవైపు కింద చిన్నపాటి కంకర వేయాల్సి ఉండగా.. ఇసుకతో పనికానిచ్చేస్తున్నారు.

# జలం చాలక.. దాహం తీరక

హైదరాబాద్: నగరంలో లోప్రెషర్ సమస్య నీటి సరఫరాపై ప్రభావం చూపుతోంది. కొన్ని రోజులుగా వివిధ ప్రాంతాల్లో లోప్రెషర్ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయి. అవసరమైన మేర నీటి సరఫరా లేకపోవడంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. మోటార్లను బిగించి నీటిని తీసుకుంటుండటంతో చుట్టుపక్కల ప్రాంతాలకు సరఫరా మరింత సమస్యగా మారింది. జలమండలి విజిలెన్స్ విభాగం ఫిర్యాదుల మేరకు అక్కడక్కడా దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా మోటార్ల వినియోగం మాత్రం తగ్గడంలేదు. నగరంలో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, హఫీజ్‌పేట, కొండాపూర్, మణికొండ, ఖైరతాబాద్, రెడ్‌హిల్స్, నాంపల్లి, హిమాయత్‌నగర్, తార్నాక, మల్కాజిగిరి, ఉప్పల్, తుకారాంగేట్ సహా వివిధ



ప్రాంతాల్లో లోప్రెషర్ సమస్య ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల సింగాపూర్- ఖానాపూర్ మధ్య పైపులైనుకు మరమ్మతులు చేయాల్సి రావడంతో నీటి పరిమాణాన్ని తగ్గించడంతో లోప్రెషర్ సమస్య ఏర్పడిందని జలమండలి జనరల్ మేనేజర్ తెలిపారు. అయినా కొన్ని ప్రాంతాల్లో నీటిని సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**వరుస పండగలతో..** ఉగాది, రంజాన్ పండగలు రావడంతో నీటికి డిమాండ్ పెరిగింది. 9,500 ట్యాంకర్ల సరఫరాకు పండగల ప్రభావంతో 25 శాతం పైగా తగ్గింది. పెండింగ్ ట్యాంకర్లకు ప్రాధాన్యం ఇస్తున్నామని, బుధవారానికి సరఫరా సాధారణ పరిస్థితికి చేరుకుంటుందని అధికారులు వివరించారు.

**ట్యాంకర్ల సరఫరా వేగవంతం చేయాలి: ఎండీ**

రానున్న రెండు రోజులు అదనపు పనిగంటలు ట్యాంకర్లు నడపాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఆయన కొండపాక పంపింగ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ముర్మూర్ వద్దనున్న ఇన్‌లెట్ నుంచి నగరానికి నీటి సరఫరా వివరాలకు సంబంధించిన ఆన్‌లైన్ మానటరింగ్ సిస్టమ్ వందశాతం వినియోగానికి ప్రణాళిక రూపొందించాలన్నారు.

# పురపాలికల్లో కాసుల గలగల

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, నగరపాలక సంస్థల పరిధిలో ఈసారి కాసుల గలగల వినిపించింది. ఆస్తిపన్ను వసూలు చేసుకోవడానికి వడ్డీ రాయితీ ఇవ్వడంతో కాస్త వసూళ్లు మెరుగుపడ్డాయి. ఆర్థిక సంవత్సరం ముగిసే చివరి రోజు వరకు ఉదయం నుంచి రాత్రి వరకు రెవెన్యూ సిబ్బంది బకాయిదారుల నుంచి పన్నులు వసూలు చేశారు. పన్ను వసూలు చేయని పుర, నగరపాలిక పేర్లను, బిల్ కలెక్టర్ల పేర్లను ప్రతిరోజు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో ప్రదర్శించారు. పైస్థాయి నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో బకాయిదారుల చుట్టూ తిరుగుతూ ఆస్తిపన్ను వసూలు చేసుకున్నారు.

**పెరిగిన ఆదాయం**

సాధారణ నిధులు ఖజానాలో లేకపోవడంతో అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. బిల్లులు, జీతాల చెల్లింపులకు కూడా ముందస్తుగా సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్తిపన్నుతోపాటు నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లు, ప్రచారబోర్డులు వంటి పన్నులు కూడా భారీగా వసూలు చేసుకున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ రంగంలోకి దిగి మరి వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తానికి ఆర్థిక సంఘం నిధులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆస్తిపన్ను శాతం పెంచుకొని గట్టెక్కారు.

నగరపాలికలు: 2
పురపాలికలు: 13
పన్ను మదింపు ఇళ్ల సంఖ్య: 2,94,271
డిమాండ్: రూ.118.84 కోట్లు
వసూలు చేసిన మొత్తం: రూ.92.15 కోట్లు

# ఉపాధి అంతంతే!

సారంగాపూర్: వలసలను నిలవరించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ఏటా నిరుపేద కుటుంబాలకు వంద రోజులు పని కల్పించాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లా వ్యాప్తంగా 380 పంచాయతీలలో 1,65,700 కుటుంబాలలో, 297,962 కూలీలు ఉండగా, 1,33,822 మంది పురుషులు, 1,64,140 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 80,394 యాక్టివ్ కుటుంబాలకు 1,06,559 మంది కూలీలు పనులకు వెళ్లారు. ఇందులో వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు పూర్తి చేసుకున్నవి కేవలం 2,700 (2024-25) మాత్రమే. గతేడాది 4854 (2023-24) మంది కుటుంబాలకు 4,85,402 పనులు చేయగా ఈ ఏడాది మరింత కూలీల సంఖ్య పడిపోయింది. జిల్లాలో ఉపాధి పనులకు 40 ఏళ్ల నుంచి 80 ఏళ్లలోపు వారే ఎక్కువగా పనులకు వెళుతున్నారు. ఇందులో మహిళలే అత్యధికంగా ఉన్నారు.

**నిబంధనలతో నష్టం** వంద రోజుల పని కల్పించేందుకు నిబంధనలతో పనులకు వెళ్లే కూలీలకు నష్టం జరుగుతోంది. ప్రతి వారం కూలీలు పనికోసం నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదు చేసుకున్న కూలీ తప్పకుండా పనులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఒకవేళ పనులకు వెళ్లనప్పటికీ నమోదు చేసుకోవడంతో ఏడాదిలో వంద రోజులలో నమోదును లెక్కిస్తారు. దీనివల్ల పనులకు వెళ్లే యాక్టివ్ కూలీలకు వందరోజులు త్వరగా పూర్తవుతున్నాయి. కొంత కాలంగా నూతన రేషన్ కార్డులు జారీ లేకపోవడంతో కుటుంబ సభ్యులంతా ఒకే కార్డులో ఉండడంతో త్వరితగతిన వంద రోజులు పూర్తవుతున్నాయి. నిబంధనలు సడలించి, పనులకు వెళ్లే కూలీలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గిట్టుబాటేదీ? ప్రభుత్వం ఏటా ఉపాధి కూలీలకు వేతనం పెంచుతున్నప్పటికీ గిట్టుబాటు కావడం లేదు. గతేడాది కూలీలకు రూ.300లు చెల్లించినప్పటికీ ఎక్కడో ఒక్క చోట మినహా ఎక్కడా అత్యధికం గా రూ.250కి మించి రావడం లేదు. సరైన కొలతలు లేకపోవడంతో, కొలతల్లో వ్యత్యాసం ఉండడంతో కూలీలు నష్టపోవాల్సి వస్తోంది.

# ఆదాయం ఘనం.. సౌకర్యాలు కనం



హైదరాబాద్ : బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ, కీసర రామలింగేశ్వర ఆలయాలకు నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారు. ప్రత్యేక రోజులు, ఉత్సవాల సమయంలో ఈ సంఖ్య లక్షల్లో ఉంటుంది. భక్తులకు సరిపడా సదుపాయాలు కల్పించడంలో మాత్రం యంత్రాంగం విఫలమవుతోంది. సరైన వసతి సౌకర్యాలు మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించినా ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

**ఏడేళ్లుగా సాగుతున్న పనులు..**

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి ఏటా రూ.4 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోంది. ఆదివారం 25 వేల మంది, మంగళవారం 15 వేల మంది, మిగిలిన రోజుల్లో 5వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. బోనాలు, మొక్కులు తీర్చుకోవడానికి ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటారు. వీరికి బస చేయడానికి అవస్థలు తప్పడం లేదు. బోనాల కాంప్లెక్స్, 8 వీఐపీ కాంప్లెక్స్‌లు (150 మందికి సరిపడా మూడు గదులు, ఏసీ, వంటగది) అందుబాటులో ఉన్నా చాలడంలేదు. రూ.3.5 కోట్ల అంచనాతో ఏడేళ్ల కిందటే పార్కింగ్ కాంప్లెక్స్, డార్మెంటరీ నిర్మాణానికి పనులు మొదలుపెట్టినా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. బిల్లులు బకాయి, నిర్మాణ వ్యయం పెరగడం, ఇతర కారణాలతో పనులు నిలిచిపోయాయి. 'ప్రసాద్' (పిలిగ్రిమేజ్ రెజువనేషన్ అండ్ స్పిరిచువల్ హెరిటేజ్ అగ్మెంటేషన్ డ్రైవ్) పథకం కింద ఆలయంలో అభివృద్ధి పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.4.21కోట్లతో అన్నప్రసాద భవనం, సోలార్ ప్యానళ్లు, ఇతర సదుపాయాలు కల్పించనున్నట్టు ప్రకటించడం కాస్త ఊరట కలిగించే అంశం. ఈ రెండూ సకాలంలో పూర్తయితేనే ప్రయాస తప్పుతుందని భక్తులు చెబుతున్నారు.

**కీసరలో కేవలం 14 గదులు..**

కీసర రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏటా రూ.4కోట్ల ఆదాయం వస్తోంది. సోమవారం 4వేల మంది, మిగిలిన రోజుల్లో 1500, శివరాత్రి, ఇతర ఉత్సవాల సమయంలో 2లక్షల మంది భక్తులు హాజరవుతుంటారు. రూ.1000 అద్దెతో కేవలం 14గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు దర్శనం, అభిషేకాలకు వస్తుంటారు. ఉండేందుకు వసతి లేకపోవడంతో సుదూర ప్రాంతాల్లో అద్దె గదులు తీసుకొని మర్నాడు దర్శనం చేసుకుంటున్నారు. ఇక్కడి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదించినా అడుగు ముందుకుపడటం లేదు.


**కీసరలో కేవలం 14 గదులు..**

కీసర రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏటా రూ.4కోట్ల ఆదాయం వస్తోంది. సోమవారం 4వేల మంది, మిగిలిన రోజుల్లో 1500, శివరాత్రి, ఇతర ఉత్సవాల సమయంలో 2లక్షల మంది భక్తులు హాజరవుతుంటారు. రూ.1000 అద్దెతో కేవలం 14గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు దర్శనం, అభిషేకాలకు వస్తుంటారు. ఉండేందుకు వసతి లేకపోవడంతో సుదూర ప్రాంతాల్లో అద్దె గదులు తీసుకొని మర్నాడు దర్శనం చేసుకుంటున్నారు. ఇక్కడి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదించినా అడుగు ముందుకుపడటం లేదు.

**జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం..**

జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయానికి ఏటా సుమారు రూ.4కోట్ల ఆదాయం వస్తుంది. నూతన సంవత్సరం, పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి ఎక్కువగా వస్తుంటారు. ఆదివారం మొక్కులు తీర్చుకునే భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. వంటలు చేసుకోవడానికి ప్రత్యేక సదుపాయాలున్నా వసతి సదుపాయాలు లేకపోవడం పెద్దలోటు.

# నిఘా నేత్రం.. అలంకార ప్రాయం



కరీంనగర్ : ఏదైనా ప్రమాద ఘటనలు, చోరీలు, ఇతరత్రా ఏది జరిగినా నిందితులను పట్టుకోవడంలో నిఘా నేత్రాలది కీలకపాత్ర. నిత్యం వేలాది మంది ప్రయాణించే ప్రయాణ ప్రాంగణాల్లో కొన్నింటిలో సీసీ కెమెరాలు లేవు.. మరికొన్ని పని చేయడం లేదు.. కొన్ని బస్టాండ్‌లలో చోరీలు, ఇతరత్రా ఘటనలు జరుగుతున్న నేపథ్యంలోనైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలోని 10 ప్రధాన బస్టాండ్‌లను పరిశీలించగా కొన్నింటిలో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మరికొన్ని బస్టాండ్‌లలో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా లేవు. ఓవైపు ప్రయాణికుల సంఖ్య, ఆదాయం పెరుగుతున్నా అందుకు తగ్గట్లుగా నిఘా నేత్రాల జాడ మాత్రం కన్పించడం లేదు. **ఇదీ పరిస్థితి..**

కరీంనగర్: బస్టాండ్‌లో 45 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. నిత్యం లక్షకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా 36 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ తరచుగా చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

జమ్మికుంట : నిత్యం 20 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు నిఘా నేత్రాలు ఉన్నా ఒక్కటీ పని చేయడం లేదు.

హుజూరాబాద్ : నిత్యం 35 వేల మంది ప్రయాణిస్తుంటారు. 7 సీసీ కెమెరాలు ఉన్నా ఒక్కటీ పని చేయడం లేదు. మూడు నెలల క్రితం ఇక్కడ చరవాణిలు చోరీ అయిన ఘటనలు జరిగాయి.

గోదావరిఖని : రోజూ 70 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కేవలం 3 సీసీ కెమెరాలు ఉండగా, అన్నీ పని చేస్తున్నాయి. పెద్ద బస్టాండ్ కావడంతో మరిన్ని నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సుల్తానాబాద్ : నిత్యం 2వేల మంది రాకపోకలు సాగిస్తారు. ఆవరణలో ఎలాంటి సీసీ కెమెరాలు లేవు.

పెద్దపల్లి : నిత్యం 10,500ల మంది ప్రయాణిస్తుంటారు. 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అన్నీ పని చేస్తున్నాయి.

వేములవాడ : నిత్యం 30వేల మంది ప్రయాణిస్తుంటారు. 12 నిఘా నేత్రాలు ఉండగా, అన్నీ పని చేస్తున్నాయి. జనవరిలో ఓ చిన్నారి అపహరణ ఘటనలో నిందితులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడ్డాయి. జగిత్యాల : నిత్యం 40 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పాత బస్టాండ్‌లో 15, కొత్త బస్టాండ్‌లో 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అన్నీ పని చేస్తున్నాయి. గతేడాది డిసెంబరులో ఓ మహిళ బస్సు ఎక్కే క్రమంలో 31 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురవగా సీసీ ఫుటేజీ ద్వారా నిందితులను పట్టుకున్నారు.

# అతివల ఆర్థిక సాధికారత



పెద్దపల్లి : ఉమ్మడి జిల్లా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బ్యాంక్ రుణ ప్రగతిలో అగ్రపథంలో నిలిచారు. ఆర్థిక సాధికారతకు బాటలు వేసుకున్నారు. కుటుంబాలను ఆర్థికంగా చక్కదిద్దుకుంటున్నారు. రుణ ప్రగతిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేసింది. ప్రగతి లేని గ్రామాల్లోని మహిళలతో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో జగిత్యాల తప్ప మిగిలిన మూడు జిల్లాలు శత శాతం దాటింది. ఈ ఏడాది రూ.2,548.72 కోట్లు లక్ష్యం విధించగా రూ.2,560.45 కోట్లు రుణాలు పంపిణీ చేశారు.

**వ్యాపారాలే బాసట** స్వశక్తి సంఘాల్లోని మహిళలు కిరాణం, కంగన్‌హాల్, వస్త్ర దుకాణాలు, పిండి గిర్ని, బేకరి, విస్తరాకుల తయారీ, వస్త్ర, జనపనార, పుట్టగొడుగులు తయారీ, వ్యవసాయం, పిల్లల చదువులు, కుటీర పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. మహిళా శక్తిలో క్యాంటీన్లు, పెరటకోళ్ల పెంపకం, మొబైల్ ఫిష్ మార్కెట్, పాడిగేదెలు, సౌరవిద్యుత్తు ప్లాంట్లతో ఆర్థికంగా ఎదుగుతున్నారు. పొదుపు కొలమానంగా ప్రతి సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. వాయిదాల కిస్తీలు చెల్లించి తిరిగి రుణం తీసుకుంటున్నారు. అప్పు కోసం ఎదురు చూడకుండా ఎలాంటి పూచీకత్తు లేకుండానే అవసరమైన రుణాలు పొందుతున్నారు. వడ్డీ వ్యాపారుల బెడద తప్పింది. రుణ లక్ష్యాలు చేరుకునేందుకు అధికారుల సమష్టి ప్రణాళిక రూపొందించారు. గ్రామ స్థాయిలోని సీఏ మొదలుకొని సీసీలు, ఏపీఎం, డీపీఎలు సమీక్షించారు. లోపాలను సరిదిద్దుకుని ముందుకెళ్లారు.

# భద్రాద్రికి కదులుతున్న రామదండు!

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలకు భక్తజనం తరలివస్తోంది. సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు రామదండు కదులుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవిదేశాల్లోని రామభక్తుల చూపంతా భద్రాచలం వైపే ఉండటంతో అదేస్థాయిలో సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం జరిగే ఎదుర్కోలు ఉత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు హాజరవుతారు. ఆదివారం నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా రానున్నారనే సమాచారంతో హెలిప్యాడ్‌లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అదేరోజు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చే అవకాశముంది. సీనియర్ ఐఏఎస్ అధికారులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకే ముఖ్యమంత్రి (ముందు వరుసలోని) సెక్టార్‌ను విస్తరించనున్నారు. సీనియర్ అధికారులకు ప్రోటోకాల్ విధులు అప్పగించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం రానున్నారు. దాదాపు దశాబ్దం నుంచి పట్టాభిషేకం వేడుకలకు గవర్నర్ హాజరవటం ఆనవాయితీగా వస్తోంది.

**భారీ బందోబస్తు**

నాలుగు రాష్ట్రాలకు సరిహద్దున ఉన్న భద్రాచలంలో నిర్వహించే



మహోత్సవాలకు అధిక స్థాయిలో ప్రముఖులు రానున్నందున అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలం గోదావరి బ్రిడ్జి చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆలయ పరిసరాల్లో బారికేడ్లను సిద్ధం చేశారు. చర్ల, దుమ్ముగూడెం మండలాలకు ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో కొద్దిరోజులుగా యుద్ధవాతావరణం నెలకొంది. పోలీసు బలగాలు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు నిత్యకృత్యమవటంతో రక్తపుటేరులు పారుతున్నాయి. ఈపరిస్థితులపై ఎప్పటికప్పుడు నిఘావర్గాలు ఆరా తీస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు అందిస్తున్నాయి. శ్రీరామనవమి ఉత్సవాల బందోబస్తులో 2వేలకు పైగా పోలీసు బలగాలు, రోప్ పార్టీలు పాల్గొననున్నాయి. రామాలయం ఆధ్వర్యంలో 150 సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని పోలీసులు సమీక్షిస్తారు. ట్రాఫిక్ చిక్కులు తలెత్తకుండా కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహిస్తారు.

**ప్రభుత్వ లాంఛనాలు పెరిగేనా..?**

నాలుగు శతాబ్దాల నుంచి శ్రీరామనవమికి ప్రభుత్వ లాంఛనాలు అందుతున్నాయి. భారతదేశం గణతంత్ర రాజ్యంగా వచ్చిన ఏర్పడిన తర్వాత దీన్ని ముఖ్యమంత్రులు అమలుచేస్తున్నారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందిస్తున్నారు. ఇందుకు రూ.15వేలు చెల్లిస్తున్నట్లు కాగితాల్లో ఉన్నప్పటికీ ఈ మొత్తం జమకావటం లేదని తెలిసింది. మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ లాంఛనాన్ని పెంచాలి. బ్రహ్మోత్సవాలకు రామాలయం రూ.2.50 కోట్లు వెచ్చిస్తుంది. ఇది రామాలయానికి భారంగా మారింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని భక్తులు కోరుతున్నారు.

# సర్వే జరగదు.. వివాదం సద్దుమణగదు!

కొత్తగూడెం: కొణిజర్ల మండలం మల్లుపల్లి, తుమ్మలపల్లి, గొబ్బగుర్తి పరిధిలోని సుమారు 500 ఎకరాల సాగుభూమి రెవెన్యూ-అటవీశాఖ మధ్య వివాదాస్పదంగా మారింది. రాష్ట్రంలో 'ధరణి' అమల్లోకి వచ్చాక అక్కడి రైతులకు పాసుపుస్తకాలు అందకపోవటం సమస్యకు కారణమైంది. రెండు శాఖల సమన్వయంతో సరిహద్దులు నిర్ణయిస్తే రైతులకు మేలు జరుగుతుంది. పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవటంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామని రైతులు వాపోతున్నారు. రెవెన్యూ, అటవీశాఖల మధ్య వివాదాలతో భూములకు హక్కులు కల్పించే అంశంపై స్పష్టత కొరవడుతోంది. అటవీ ప్రాంతం సరిహద్దులో సాగుచేసుకుంటున్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని వేల ఎకరాలకు పాసుపుస్తకాలు జారీకావటం లేదు. 2017-18లో భూదస్త్రాల ప్రక్షాళన కార్యక్రమంతో ఈసమస్య వెలుగుచూసింది. క్షేత్రస్థాయిలో భూసర్వే చేసి వివాదాలను పరిష్కరించాల్సి ఉండగా.. ముందడుగు పడటం లేదు. ఖమ్మం జిల్లాలో 3,773 ఎకరాల విస్తీర్ణంలో అటవీ-రెవెన్యూశాఖల మధ్య సరిహద్దు సమస్య ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భద్రాద్రి జిల్లాలో కొన్నిప్రాంతాల్లో పట్టాభూములను అటవీ ప్రాంతంలో కలిపి చూపుతున్నట్లు రైతులు వాపోతున్నారు. కొన్నిచోట్ల అటవీ భూములకూ పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఎదురవుతున్న ఇబ్బందులు**

రెవెన్యూశాఖ ఒక భూమిని వ్యక్తులకు లేదా సాగుకోసం కేటాయిస్తే.. అటవీశాఖ దానిని అటవీ భూమిగా పరిగణించటం వివాదాలకు కారణమవుతోంది. దీనివల్ల సదరు భూమి ఎవరి ఆధీనంలో ఉందనే దానిపై స్పష్టత కొరవడుతోంది. హక్కుదారులు గందరగోళానికి గురవుతున్నారు.

రెవెన్యూ దస్త్రాలు ఒకరకంగా.. అటవీశాఖ రికార్డులు మరోరకంగా ఉండటం వల్ల వివాదాలు కోర్టుల వరకు వెళ్తున్నాయి. దీనివల్ల సామాన్యులు ఆర్థికంగా, మానసికంగా చితికిపోతున్నారు.

రెవెన్యూ, అటవీశాఖ మధ్య సమన్వయం కొరవడటం వల్ల సమస్యలు సత్వరమే పరిష్కారం కావటం లేదు.

పాసుపుస్తకాలు లేకపోతే వాటిని అటవీశాఖ భూములుగానే పరిగణిస్తాం. జిల్లాలో కొన్నిచోట్ల భూములున్నా పాసుపుస్తకాలు లేవు.. పాసుపుస్తకాలున్న చోట భూములు కానరావటం లేదు. క్షేత్రస్థాయిలో సర్వే జరిగితేనే ఈసమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ, అటవీశాఖ మధ్య వివాదాలు సద్దుమణిగే అవకాశముంది.

– కిష్టాగౌడ్, డీఎఫ్ఓ, భద్రాద్రి కొత్తగూడెం

## వస్త్ర పరిశ్రమ ప్రగతికి 'ముద్ర'

సిరిసిల్ల: వస్త్రోత్పత్తుల్లో ఆధునికతను అందిపుచ్చుకుంటేనే మనుగడ. జిల్లాలో అత్యధికంగా మరమగ్గాలు విస్తరించి ఉన్నాయి. తీసుకున్న ఆర్డర్లకు.. మరమగ్గాల ఆధునికీకరణకు పెట్టుబడుల కోసం ఆసాములు, కార్మికుల వద్ద డబ్బులులేక నేటికీ మూస ధోరణిలోనే వెళుతున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రధానమంత్రి ముద్ర (మైక్రో యూనిట్స డెవలప్ మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ) యోజన పథకం కింద మరమగ్గాల విస్తరణ, అభివృద్ధి కోసం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో రుణాల మంజూరుకు చేనేత జౌళి శాఖ ప్రణాళిక రూపొందించింది. జిల్లాలోని బ్యాంకర్లు, అధికారులతో జనవరిలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనిలో లీడ్ బ్యాంకుతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. దరఖాస్తుల పరిశీలన తర్వాత బ్యాంకుల లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు అంగీకరించారు.

కొత్త మరమగ్గాలతో యూనిట్ల ఆధునికీకరణ, వస్త్రోత్పత్తులకు ముడి సరకుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయనున్నారు. ముద్ర పథకం కింద రుణాలు పొందేవారు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పిస్తున్నారు. మద్రలో శిశు పథకంలో రూ.50వేల లోపు, కిషోర్‌లో రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు. తరుణ్‌లో రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే వీలుంది.

మరమగ్గాలు, వాటి విడిభాగాలు కొనుగోలు చేసేవారు తయారీ సంస్థల నుంచి యూనిట్ వ్యయం సమర్పించాలి. పెట్టుబడుల కోసమైతే బ్యాంకు కేవైసీ, పాన్‌కార్డును సమర్పించాలి. ఆదాయపన్ను చెల్లించే వారు వాటికి సంబంధించిన పత్రాలు జత చేయాలి. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యాక మరోసారి బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తారు. దీనిలో ఏ బ్యాంకు ఎన్ని యూనిట్లు మంజూరు చేస్తుందనే లక్ష్యం నిర్ణయించనున్నారు. ఇప్పటికే చేనేత, జౌళిశాఖ కార్మికులు, ఆసాముల నుంచి 820 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో వీటి పరిశీలన జరుగుతోంది. ఈ నేపథ్యంలో ముద్ర పథకం పూర్తిస్థాయిలో అమలైతే పరిశ్రమకు మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఇంటి నంబర్లు సృష్టించి.. రిజిస్ట్రేషన్ చేయించి

హైదరాబాద్ :శంషాబాద్ విమానాశ్రయం రన్‌వే సమీపంలో ప్రభుత్వ ఎసైన్డ్ భూములపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. ఎసైన్డ్‌దారులను బెదిరించి.. కొంత మొత్తం చేతుల్లో పెట్టేసి సంతకాలు చేయించుకొని తరిమేస్తున్నారు. అనంతరం ప్లాట్లుగా మార్చి రేకుల షెడ్లు నిర్మించి దొడ్డిదారిన ఇంటి నంబర్లు తెచ్చుకుంటున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి రెవెన్యూ నంబర్లు 219, 220, 221లోని 18.23 ఎకరాల భూములను పట్టాదారు ఎండీ.అబ్దుల్ రషీద్ వద్ద 1987లో అప్పటి ప్రభుత్వం రూ.1,85,750లకు కొనుగోలు చేసింది. గొల్లపల్లికి చెందిన కార్మికులకు జీవనోపాధి కోసం 17 గుంటల చొప్పున 42 మందికి పంపిణీ చేసింది. అప్పటినుంచి ఆ భూముల్లో ఉంటున్నారు. వీటికి సమీపంలోనే శంషాబాద్ విమానాశ్రయం రావడంతో అక్రమార్కుల కన్ను వాటిపై



పడింది. రెండు మూడేళ్ల నుంచి ముగ్గురు మాజీ ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులు ఎసైన్డ్ భూములను ఎకరాల్లో కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. భూములు విక్రయించమని చెప్పినా.. సర్కారు వెనక్కి తీసుకుంటుందని భయపెట్టి వారికి రూ.లక్షల్లో డబ్బులిచ్చి వెంచర్లు వేసేంత వరకూ ఇక్కడే ఉండాలని చెబుతున్నారు.

**నిషేధిత జాబితాలో చేర్చినా..**

గొల్లపల్లి కార్మికులకు ఇచ్చిన భూములను వారు కూడా విక్రయించకుండా ప్రభుత్వం 18.23 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చింది. ప్రస్తుతం ఇవి 'ఖరీజ్ ఖాతా' విభాగంలో ఉన్నాయి. కార్మికుల నుంచి కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించినా వారి పేర్లమీద రిజిస్ట్రేషన్ కావు. అందుకే అక్రమార్కులు ఇంటి నంబర్లతో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. వెయ్యి గజాల్లో ఇల్లు కట్టుకున్నామంటూ శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంటి నంబరు రాగానే నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి తమ అనుచరుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అక్రమార్కులు ఇప్పటి వరకూ సొంతం చేసుకున్న భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.300 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

## పక్కన చేరి.. కలిపేసుకొని

కుత్బుల్లాపూర్ : అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో వాటిలోని ప్రభుత్వ స్థలాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొందరు ప్రైవేటు పట్టాభూముల్లో లేఅవుట్లు చేసేటప్పుడు సర్కార్ స్థలాలను కలుపుకొని ప్లాట్లు చేసి విక్రయించారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలుకు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆయా లేఅవుట్లలోని ప్లాట్లు ప్రభుత్వ సర్వే నంబరులో లేవని రెవెన్యూ అధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది.

**రూ.476 కోట్ల విలువ చేసే భూముల ఆక్రమణ**

గాజులరామారం సర్కిల్‌లో రెండు దశాబ్దాలుగా కొందరు వ్యక్తులు ప్రైవేట్ వెంచర్ల మాటున కొనసాగించిన కబ్జాకాండతో రూ.476.4 కోట్ల 17.4 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. నిబంధనలప్రకారం ప్రైవేట్ పట్టా భూమిని లేఅవుట్ చేయాల్సివస్తే.. అందులో 2.5శాతం భూమిని సామాజిక అవసరాలకు..7.5 శాతం ఉద్యానాలకు.. 30 శాతం స్థలం రోడ్లకు కేటాయించాల్సి ఉంటుంది. కానీ కొందరు పథకంప్రకారం ప్రభుత్వ భూముల పక్కన ప్రైవేట్ పట్టా భూములను కొనుగోలుచేసి.. సర్కార్ స్థలాలనూ కలిపేసుకున్నారు. పాతతేదీలతో గ్రామ పంచాయతీ లేఅవుట్లు (అక్రమ లేఅవుట్లు) సృష్టించి ప్లాట్లవిక్రయానికి శ్రీకారం చుట్టారు. ఈ తరహా లేఅవుట్లలో చాలా వరకు ప్లాట్లు ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు నోచుక్కోదని సమాచారం.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు-మల్లికార్జున్‌రావు, డిప్యూటీ తహసీల్దార్, కుత్బుల్లాపూర్** కొందరు తమ లేఅవుట్లలో కలుపుకొని ప్లాట్లు చేసి విక్రయించినట్లు ఒకరు జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాడు. ప్రస్తుతం ఈ భూముల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తేనే అక్కడి సర్కార్ స్థలాల వివరాలు తెలిసే అవకాశం ఉంది. ఎల్ఆర్ఎస్ పథకం మార్గదర్శకాలు అందాక ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత లేఅవుట్లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

# మొదటి గంటే.. కీలకం

కరీంనగర్ : కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సైబర్ నేరగాళ్ళు చెలరేగిపోతున్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటీపీ చెప్పాలని, బహుమతి గెలుచుకున్నారు.. చూడాలంటే క్లిక్ చేయాలని, మీ ఖాతాల్లో డబ్బులు పంపించామని చూసుకోమని.. ఇలా అనేక రకాలుగా మోసగించి రూ.కోట్లు దోచేస్తున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అవగాహన లేని వారే కాదు.. విద్యావంతులూ మోసపోతుండటం గమనార్హం. సైబర్ నేరగాళ్ల బారిన పడినప్పుడు గంటలోపు మేల్కొంటే సాధ్యమైనంత వరకు ప్రమాదం నుంచి బయటపడవచ్చని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసుస్టేషన్ ఏసీపీ నరసింహారెడ్డి సూచించారు. ఆలోపు నేరగాళ్లు డబ్బులు డ్రా చేసుకుంటే మాత్రం.. తిరిగి రప్పించడం కష్టమవుతుందన్నారు. ఇలా చేయండి.. %htps:cybercrime.gov.in% పోర్టల్‌ను క్లిక్ చేయాలి. హోం పేజీలోకి వెళ్లి ఫైల్ ఏ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని నియమ, నిబంధనలు, సూచనలు చదవాలి.

రిపోర్ట్ అదర్ సైబర్ క్రైం బటన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్ చేసి పేరు, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ తదితరాలు నమోదు చేయాలి.

రిజిస్టరు మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసి క్యాప్చర్ కోడ్ పొందుపరిచి మీట నొక్కాలి.

తర్వాత పేజీలోకి వెళ్తుంది. నేరం గురించి క్లుప్తంగా వివరించాలి. అక్కడ సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం, సైబర్ నేరానికి సంబంధించి సమాచారం, ప్రివ్యూ అని ఉంటాయి.

ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలు నమోదు చేస్తూ ప్రక్రియ పూర్తి చేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూ పరిశీలించాలి.

అన్ని వివరాలు సక్రమంగా ఉంటే సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత ఘటన ఎలా జరిగిందో వివరించాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (ఖాతా లావాదేవీలు) వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపరచాలి.

అన్ని మరోసారి పరిశీలించి సబ్మిట్ బటన్ నొక్కితే కన్ఫర్మేషన్ సమాచారం వస్తుంది. కంప్లైంట్ ఐడీతోపాటు ఇతర వివరాలు ఈ-మెయిల్ ఐడీకి వస్తాయి. ఆ తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు. ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగులు వేర్వేరు ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తారు. లేకుంటే క్రిప్టోకరెన్సీగా ఆపై డాలర్లుగా మార్చుకునే అవకాశం ఉంటుంది.

**వెంటనే 1930కి ఫోన్ చేస్తే..**

1930 కాల్ సెంటర్‌కు బ్యాంకుల రిస్క్ మేనేజ్‌మెంట్ బృందాలు అనుసంధానమై ఉంటాయి. సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే వారు స్పందించి చర్యలు తీసుకుంటారు. బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్ల డబ్బులను ఎక్కడికి మళ్లించుకుంటున్నారో గుర్తించి ఆ ఖాతాలను వెంటనే ఫ్రీజ్ చేస్తారు. డబ్బు డ్రా చేసుకునే అవకాశం లేకుండా కట్టడి చేస్తారు.

డబ్బు పోగొట్టుకున్న బాధితులు ఆలస్యం చేయకుండా గంటలోపు ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీ చేయడం లేదా నేరగాళ్లు నగదు మళ్లించుకునే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటారు.

## మారుదామా.. దిల్లీలా మార్చేద్దామా?



హైదరాబాద్: దేశ రాజధాని దిల్లీలో 15 ఏళ్లు దాటిన వాహనాలకు మార్చి 31 తరువాత బంకుల్లో ఇంధనం పోయకూడదంటూ కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా అధికారులను ఆదేశించారు. బంకుల్లో ప్రత్యేకంగా రూపొందించిన పరికరాలతో కాలం చెల్లిన వాహనాలను గుర్తిస్తారు. కాలుష్య కోరల నుంచి దిల్లీని బయటపడేయడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగమే ఇదంతా. అక్కడ గాలి నాణ్యత పడిపోతుండటంతో కాలుష్య కట్టడికి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. దీనికి ప్రధాన కారణం కాలం చెల్లిన పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలేనని అధికారులు నిర్ధారణకు వచ్చారు. మన మహా నగరం కూడా అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కాలం చెల్లిన వాహనాల విషయంలోనూ దిల్లీ బాట పట్టాల్సిన అవసరం ఉంది.సాధారణంగా వాయు నాణ్యత సూచీ 100లోపు ఉంటేనే స్వచ్ఛమైన గాలి పీలుస్తున్నట్లు. గ్రేటర్ పరిధిలో 150 వరకు చేరుకుంటుంది. ఏటా కాలం చెల్లిన వాహనాలు పెరుగుతూ ఉన్నాయి.


హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో జనవరి నాటికి 84లక్షల వాహనాలుంటే.. అందులో కాలం చెల్లినవే 24.40లక్షలు.

వ్యక్తిగత వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటి నుంచి 15 ఏళ్లు, వాణిజ్య వాహనాలు ఏడేళ్లు దాటితే కాలం చెల్లినవిగా కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ పరిగణిస్తుంది.

తుక్కు చేస్తే రాయితీలు

కాలం చెల్లిన వాహనాలను తుక్కుగామార్చి.. అలాంటి వాహనాలనే కొనుగోలు చేసే వారికి రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. ద్విచక్రవాహనాల నుంచి భారీ వాహనాల వరకు తుక్కుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు కేంద్రాలను మంజూరు చేసింది. కాలుష్య కారక వాహనాలను తగ్గించి విద్యుత్తు వాహనాల వినియోగం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాలను తుక్కుగా మార్చుకుని అదే విభాగానికి చెందిన వాహనాన్ని కొనుగోలు చేస్తే జీవితకాల పన్నులో కొద్ది మొత్తాన్ని రాయితీగా ఇస్తుంది.

## నిర్మించుకోండి.. ఆకాశ నడక మార్గాలు



హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ సమస్యతో పాటు కాలుష్యాన్ని తగ్గించేలా ప్రైవేటు వాహనాల సంఖ్యను తగ్గించడానికి ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా మెట్రో స్టేషన్ల నుంచి వాటి సమీపంలోని వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలకు ఆకాశ నడక మార్గాలు (స్కైవాక్) నిర్మాణాలను ప్రోత్సహించాలని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు ఇటీవల జరిగిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్రణాళిక సమావేశంలో నిర్ణయించారు. ఈ వివరాలను మెట్రోరైలు సంస్థ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

**ఇప్పటికే అందుబాటులో..**

పంజాగుట్ట, హైటెక్‌సిటీ, ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ల నుంచి సమీపంలోని మాల్స్‌కు ఇప్పటికే ఎల్ అండ్ టీ మెట్రోరైలు సంస్థ స్కైవాక్‌లను నిర్మించింది. జేబీఎస్, పరేడ్ గ్రౌండ్స్ స్టేషన్లను కలుపుతూ రహదారి దాటే అవసరం లేకుండా అందుబాటులోకి తీసుకొచ్చారు. సికింద్రాబాద్ మెట్రో స్టేషన్ నుంచి సమీపంలోని రేతిఫైల్ బస్టాండ్, రైల్వే స్టేషన్ చేరుకునేలా స్కైవాక్ ఉంది. ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు అనుసంధానంగా కూడలిలో వలయాకారంలో ఆకాశ నడక మార్గాన్ని హెచ్ఎండీఏ నిర్మించింది.

**ప్రతి స్టేషన్ పాదచారుల వంతెనే**

మెట్రో మొదటి దశలోని 69.2 కి.మీ. మార్గంలోని మొత్తం 57 మెట్రో స్టేషన్లలో...ప్రతి స్టేషన్ నుంచి రహదారికి ఒకవైపు నుంచి మరోవైపునకు చేరుకునేందుకు అవకాశం ఉందని ప్రయాణికులే కాదు.. ఇతరులూ వినియోగించుకోవచ్చని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

**త్వరలో సాకారం..**

ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ పక్కనే వాసవీ ఆనంద నిలయం పేరుతో భారీ గేటెడ్ కమ్యూనిటీ నిర్మిస్తున్నారు. తమ నివాస సముదాయానికి మెట్రో స్టేషన్ నుంచి ఆకాశ నడక మార్గం నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇదే విధంగా మరికొన్ని సంస్థలు నాగోల్, స్టేడియం, దుర్గం చెరువు, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ల నుంచి ఈ తరహా స్కైవాక్‌ల ఏర్పాటుకు తమతో చర్చలు జరుపుతున్నాయని ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో ఎండీ కేవీబీరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రైవేటు సంస్థలు ఎల్ అండ్ టీ మెట్రోరైలు స్టేషన్ రిటైల్ అధికారి కె.వి.నాగేంద్ర ప్రసాద్ 99000 93820 ను సంప్రదించవచ్చని సూచించారు.

**రైలు దిగి కార్యాలయంలోకే..**

రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి సమీపంలోని మైండ్‌స్పేస్ ఐటీ పార్క్‌కు రహేజా సంస్థ స్కైవాక్ ఏర్పాటు చేసింది. ఇది ఐటీ ఉద్యోగులకు సౌకర్యంగా మారింది. బాలానగర్ స్టేషన్ నుంచి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫినిక్స్/ల్యాండ్ మార్క్ మాల్‌కు అనుసంధానంగా ఆ సంస్థ స్కైవాక్ అందుబాటులోకి తెచ్చింది.

## అర్హత ఉన్నా అందని రేషన్ కార్డులు

హైదరాబాద్: నగరంలో రేషన్ కార్డుల పంపిణీపై అయోమయ పరిస్థితి తొలగడంలేదు. ఈనెల ఒకటో తేదీ నుంచి కార్డుల పంపిణీకి అధికార యంత్రాంగం సన్నద్ధమైనట్లు ప్రకటించినా మొదలుకాలేదు. నగరంలో అయిదు లక్షల మందికి పైగా కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం 83 వేల మందిని ప్రాథమికంగా అర్హులుగా గుర్తించింది. వార్డుసభలను నిర్వహించి వీరిలో 60 వేల మందిని లబ్ధిదారులుగా ఎంపికచేసి కార్డుల పంపిణీకి పౌరసరఫరాల శాఖ సిద్ధమైంది. మరోసారి మీసేవా కేంద్రాల ద్వారా కార్డుల పంపిణీకి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు కొత్త రేషన్ కార్డుల పంపిణీ నిరంతర కార్యక్రమంగా ప్రకటించడంతో గతంలో దరఖాస్తు చేసుకోనివారు పలువురు కార్డుల కోసం దరఖాస్తులు అందజేశారు. రెండోసారి మీసేవా కేంద్రాల్లో 1.3 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి దశలో జీహెచ్ఎంసీ పరిధిలో వార్డుసభలను నిర్వహించడంలో జరిగిన జాప్యంతో లబ్ధిదారులను ఖరారు చేయడంలో ఆలస్యం జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహించిన వార్డు సభల్లోనే రేషన్ కార్డుల



అర్హులను గుర్తించారు. అర్హులైన పేదలు రాయితీతో గ్యాస్ సిలిండర్లు పొందే అవకాశం ఉంది. పేదలకు పలు విధాల ఉపయోగపడేలా ఉన్న కార్డుల పంపిణీ వాయిదాపడుతుండడంతో దరఖాస్తుదారులను ఆందోళనకు గురిచేస్తోంది.

## సాగు భిన్నం.. రాబడి నిత్యం

సుల్తానాబాద్: ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామం కూరగాయల సాగులో ఆదర్శంగా నిలుస్తోంది. ఊరిలో దాదాపు 60 మంది రైతులుండగా వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తూనే దాదాపు 30 ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు. పొలాలు, ఇళ్ల పరిసరాలు.. ఇలా ఎక్కడ కొద్దిపాటి ఖాళీ స్థలం దొరికినా టమాట, బీర, చిక్కుడు, మిర్చి, సొరకాయ, కాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ, కాకర, అలసంత, ఉల్లి, వెల్లుల్లి, కొత్తిమీర, మెంతి తదితర కూరగాయల సాగు చేస్తున్నారు. నేరుగా సుల్తానాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ మార్కెట్లకు తరలిస్తూ సొంతంగా విక్రయిస్తున్నారు.

**మిశ్రమ పంటల సాగు**

కాలానుగుణంగా పండే రకాలు సాగు చేస్తున్న లాలపల్లి రైతులు విపణిలో ధరలను అంచనా వేస్తూ మిశ్రమ రకాలు వేస్తున్నారు. ఒక రకానికి గిట్టుబాటు ధర లేకున్నా మరో రకంతో ఆ లోటు పూడ్చుకుంటున్నారు. ప్రస్తుతం టమాట టోకు ధర కిలోకు రూ.5 పలుకుతుండగా, బీరకాయ, మిర్చి ధర రూ.80 వరకుంటోంది. ఈ రెండు రకాలను ఏక కాలంలో సాగు చేస్తుండటంతో నష్టం లేకుండా చూసుకుంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో సాగుకు దాదాపు రూ.20 వేలు పెట్టుబడి పెడుతుండగా మూడు నెలల పాటు దిగుబడి వస్తోంది. ఏడాది పొడవునా కూరగాయలు పండిస్తుండగా రోజువారీగా ఆదాయం వస్తోంది.

**ఆరు నెలల్లో రూ.3 లక్షల ఆదాయం**

గడ్డం రాజేశ్వర్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మరోవైపు ఒకటిన్నర ఎకరంలో మిర్చి, క్యాబేజీ, కాలీఫ్లవర్, కాకర, బీర పండిస్తున్నారు. కేవలం కూరగాయలతోనే ఆరు నెలల్లో దాదాపు రూ.3 లక్షల ఆదాయం వస్తోంది. కుమారుడు మధును సివిల్ ఇంజినీరింగ్ చదివించి లండన్‌కు పంపించారు. కూతురు మౌనికను ఎంబీఏ వరకు చదివించి వివాహం చేశారు.

**అవసరాలు తీరుతున్నాయి**

ముస్కు మహిపాల్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరి, మొక్కజొన్న సాగు చేస్తూనే, ఎకరంలో క్యాబేజీ, కాలీఫ్లవర్, బీర సాగు చేస్తున్నారు. ప్రతి నెలా రూ.20 వేలు సంపాదిస్తుండగా పిల్లల చదువులకు, ఇంటి అవసరాలకు, పంట పెట్టుబడి ఖర్చులకు ఇబ్బంది లేకుండా మారిందని చెబుతున్నారు. ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, పురుగుమందులు, పిచికారీ పరికరాలు అందించాలని కోరుతున్నారు.

## భద్రతకు ప్రాధాన్యం.. భవితకు సోపానం

కరీంనగర్ : ప్రజలు, కార్మికులు, ఇతరులు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పని ప్రదేశాల్లో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలి. చాలాచోట్ల ఇవి పక్కాగా అమలు కావడంలేదు. మార్చి 4 నుంచి 10వ తేదీ వరకు దేశవ్యాప్తంగా పరిశ్రమల్లో భద్రతా వారోత్సవాల పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నేడు జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఎలాంటి పరిశ్రమలు ఉన్నాయి. కార్మికుల భద్రతకు ప్రభుత్వాలు ఎలాంటి చట్టాలు అమలు చేస్తున్నాయి. తదితర వివరాలతో కథనం.

**చేపట్టాల్సిన చర్యలు ఇలా...**

ప్రమాదకర పని ప్రదేశాల్లో యాజమాన్యాలు కార్మికులకు రక్షణ చర్యల గురించి అవగాహన కల్పించాలి. ఆ తర్వాతే పనిలో పెట్టుకోవాలి

ప్రతి క్వారీలో హెల్మెట్, షూస్, మాస్క్, సేఫ్టీ బెల్టు, తదితర రక్షణ చర్యలు పాటించాలి.

పని ప్రదేశంలో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి.

అగ్ని ప్రమాదాల రక్షణ చర్యలు పాటించాలి.

భవన నిర్మాణాల రంగ కార్మికులకు హెల్మెట్, షూస్, మాస్క్‌తోపాటు ఇతర రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలి. పైవేవీ చాలా చోట్ల పాటించడంలేదు.

ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కారు డ్రైవరు సీటు బెల్టు పెట్టుకోవడం కూడా రక్షణ చర్యలో భాగమే.



ఇటుక బట్టీల్లో కార్మికులకు మౌలిక వసతులు, ప్రాథమిక వైద్యం అందేలా చూడాలి. చిన్న పిల్లలుంటే పాఠశాలకు పంపించాలి. గంగాధర మండలంలో ఇటుక బట్టీ ప్రాంతంలో ఉపాధ్యాయురాలిని నియమించి చదువు నేర్పిస్తున్నారు. చాలా చోట్ల అమలు కావడంలేదు.

**ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు..**

కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ క్వారీలు, కటింగ్ పరిశ్రమలు, విత్తనశుద్ధి పరిశ్రమలు, పెద్దపల్లి జిల్లాలో బొగ్గు నిక్షేపాలు, థర్మల్ కేంద్రాలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో పవర్‌లూమ్స్, టెక్స్‌టైల్స్, ఇతర పరిశ్రమలు, జగిత్యాల జిల్లాలో ఆహార శుద్ధి, ఇతర పరిశ్రమలు ఉన్నాయి.

రైస్ మిల్లులు, భవన నిర్మాణ రంగం అన్ని జిల్లాలో ఉన్నాయి. పని ప్రదేశాల్లో సరైన రక్షణ చర్యలు తీసుకోకపోతే కార్మికులు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ-శ్రామ్ పోర్టల్‌లో సంఘటిత, అసంఘటిత కార్మికులుగా 4.88 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు.

**లక్ష్యాలు...**

జాతీయ భద్రతా దినోత్సవ నిర్వహణ బాధ్యతను నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చూస్తోంది. పని, సాధారణ జీవనశైలిలో భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడం. కార్యాలయాల్లో భద్రత కల్పించడం. కర్మాగారాల చట్టం 1948 ప్రకారం 150 మంది కార్మికులకు ఒక ప్రథమ చికిత్స పెట్టెను, 500 మందికి మించి కార్మికులు ఉంటే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. విశ్రాంతి గదులు, భోజనశాల ఉండాలి. వారి యోగ క్షేమాల పర్యవేక్షణకు సంక్షేమాధికారిణి నియమించాలి.30 మందికి మించి మహిళా కార్మికులు ఉంటే శిశు సంరక్షణ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

**సమష్టి బాధ్యత**పరిశ్రమలు, పని చేసే ప్రదేశాల్లో కార్మికుల రక్షణకు సంబంధించిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో కార్మికులు భద్రతా చర్యలకు అనుగుణంగా పనులు చేయాలి. భద్రత అనేది సమష్టి బాధ్యత. రేపటి కోసం అందరం కట్టుబడి ఉందాం. పనిలోకి తీసుకున్న కార్మికులకు చేసే పనిపై శిక్షణ తర్ఫీదు కూడా ఇవ్వాలి.గంగాధర్ రెడ్డి, కర్మాగార తనిఖీ అధికారి, కరీంనగర్

# సచివాలయంలో అగ్నిప్రమాదం పరిశీలించిన సీఎం చంద్రబాబు



**అమరావతి: ఏపీ సచివాలయంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. రెండో బ్లాక్‌లో యూపీఎస్ బ్యాటరీ రూమ్ వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులను సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు.**



# జగన్.. ఆస్తులు కాజేసిన మేనమామగా చరిత్రలో నిలిచిపోతారు

అమరావతి: సరస్వతి పవర్ షేర్ల ఎంవోయూపై వైకాపా అధ్యక్షుడు జగన్ స్వయంగా సంతకం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.

ఇప్పటి వరకు ఒక్క ఆస్తి కూడా జగన్ తనకు ఇవ్వలేదని చెప్పారు. "విజయమ్మకు సరస్వతి పవర్ షేర్లను జగన్ గిఫ్ట్‌డీడ్ కింద ఇచ్చారు. ఇచ్చిన షేర్లు మళ్లీ తనకే కావాలని ఆయన కోర్టుకు వెళ్లారు. స్వయంగా తల్లినే జగన్ మోసం చేస్తున్నారు. తల్లిపై కేసు వేసిన కుమారుడిగా.. మేనల్లుడు, మేనకోడలి ఆస్తులు కాజేసిన మేనమామగా ఆయన చరిత్రలో మిగిలిపోతారు. జగన్‌కు విశ్వసనీయత ఉందో..లేదో.. వైకాపా వారే ఆలోచించాలి" అని షర్మిల వ్యాఖ్యానించారు.




# 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల ప్రకటన

**ఏపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు కొనసాగుతోంది. అందులోభాగంగా 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 31 టీడీపీ, 6 జనసేన, 1 బీజేపీ నేతలకు కేటాయించిందీ ప్రభుత్వం. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకోసం కసరత్తు జరుగుతోందని పేర్కొంది.**

# ఏపీలోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' ప్రారంభం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. తొలి విడతలో భాగంగా 26 జిల్లాల్లోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మిగిలిన కార్యాలయాల్లో ఈ నెలాఖరులోగా దశలవారీగా ప్రారంభించనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. పేదలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. వ్యాపారులు, ప్రజల శ్రేయస్సు దృష్ట్యా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలకు సులభతర విధానాలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. ఇలాంటి కొత్త సంస్కరణల వల్ల అవినీతికి తావుండదని పేర్కొన్నారు. "ఇకమీదట రోజుల తరబడి వేచిచూసే అవకాశం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మంచి ఫలితాలు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ముందుకెళ్తున్నాం. భూ వివాదాలు లేకుండా సంస్కరణలు తీసుకొస్తున్నాం. అభివృద్ధి కోసం నాలా చట్టాన్ని కూడా తీసేసి కొత్త విధానం తెస్తున్నాం" అని అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్యపై స్పందించిన పవన్ కల్యాణ్



అమరావతి: రాజమహేంద్రవరంలో ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి ఆత్మహత్య దురదృష్టకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆమె ఆత్మహత్యకు కారకుడిపై చట్టప్రకారం చర్యలుంటాయని తెలిపారు. నాగాంజలి సూసైడ్ నోట్ మేరకు ఇప్పటికే ఆస్పత్రి ఏజీఎం దీపక్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు పవన్ తెలిపారు. విద్యార్థినులు, యువతుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

**నాగాజంలి కుటుంబానికి న్యాయం చేస్తాం: హోంమంత్రి అనిత...**

ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతి పట్ల హోంమంత్రి అనిత స్పందించారు. ఆమె మృతి బాధాకరమన్నారు. "నాగాంజలికి కాపాడేందుకు వైద్యులు ఎంతో ప్రయత్నించారు. కాపాడాలనే తపన మాది.. శవరాజకీయాలు చేయాలనే ఆతృత విపక్షాలది. నాగాంజలి కుటుంబానికి అండగా ఉంటాం. న్యాయం చేస్తాం"అని మంత్రి అన్నారు.

# రెడ్‌బుక్ పేరు చెబితే భయపడి పారిపోతున్నారు: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అమరావతి: మాజీ మంత్రి, వైకాపా నేత రోజా గురించి మాట్లాడాలంటే రోతగా ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే ప్రజలు ఛీ కొట్టి 11 సీట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. "రాష్ట్రం నుంచి వైకాపాను తరిమి కొట్టడానికి ప్రజలు మరోసారి సిద్ధంగా ఉన్నారు. ఆ ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు మర్చిపోయి సుద్దపూసలా మాట్లాడుతున్నారు. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో కోట్ల రూపాయల దోపిడీ చేశారు. జ్ఞానం లేని వైకాపా నేతల మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. మహిళలకు 'తల్లికి వందనం' ఇస్తాం. రైతు కుటుంబాలకు రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాలు జోరుగా అమలులోకి వచ్చాయి. వైకాపా వాళ్లకు రెడ్‌బుక్ పేరు చెబితే భయపడి పారిపోతున్నారు" అని గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు.




# నీట్ వ్యతిరేక బిల్లు.. స్టాలిన్ సర్కార్‌కు షాక్

చెన్నై: వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష నుంచి తమిళనాడు నుంచి మినహాయించాలని గత కొన్నేళ్లుగా రాష్ట్రం డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దీనిపై కేంద్రం, డీఎంకే ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ పరిణామాల వేళ స్టాలిన్ సర్కారుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తమిళనాడు పంపిన నీట్ వ్యతిరేక బిల్లును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరస్కరించారు. ఈ విషయాన్ని సీఎం స్టాలిన్ రాష్ట్ర శాసనసభలో వెల్లడించారు. "ఈ అంశంపై తమిళనాడు సర్కారు అన్ని వివరణలు ఇచ్చినప్పటికీ.. నీట్ నుంచి మన రాష్ట్రాన్ని మినహాయించేందుకు కేంద్రం తిరస్కరిస్తోంది. ఇది దక్షిణాది రాష్ట్రాన్ని అవమానించడమే. అయితే, వారు (కేంద్రం) మన అభ్యర్థనను తిరస్కరించొచ్చు కానీ.. మన పోరాటాన్ని ఆపలేరు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేందుకు న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తాం. న్యాయ నిపుణులను సంప్రదిస్తాం" అని స్టాలిన్ అసెంబ్లీలో తెలిపారు. దీనిపై సమగ్రంగా చర్చించేందుకు ఏప్రిల్ 9న అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష కారణంగా తమిళనాడులో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నీట్ పరిధి నుంచి తమిళనాడును శాశ్వతంగా మినహాయించాలంటూ అక్కడి ప్రభుత్వం ఓ బిల్లును తీసుకొచ్చింది. దీని ప్రకారం.. 12వ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థులకు వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ బిల్లును ఇప్పటికే 2021, 2022లో రెండుసార్లు తమిళనాడు అసెంబ్లీ ఆమోదించింది. అనంతరం గవర్నర్‌కు పంపగా.. పలుమార్లు తిరస్కరణకు గురైంది. దీంతో బిల్లులో కొన్ని మార్పులు చేసి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు.

ఇప్పటికే హిందీ వివాదం, డీలిమిటేషన్ వంటి అంశాలపై కేంద్రం, తమిళనాడు సర్కారు మధ్య వివాదం కొనసాగుతోంది. తాజాగా నీట్ బిల్లును తిరస్కరించడంతో ఇది మరింత ముదిరేలా కన్పిస్తోంది. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.



# పెంగ్విన్ మీమ్స్ హల్‌చల్

## పెంగ్విన్‌లు నివసించే దీవులపైనా ట్రంప్ సుంకాలు.. నెట్టింట మీమ్స్ హల్‌చల్

భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై సుంకాల మోత మోగించి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అయితే ఈ దేశాల జాబితాలో జనసంచారం లేని అంటార్కిటికా దీవులు కూడా ఉండటం ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రస్తుతం ఈ అంశంపై సోషల్‌మీడియా వేదికగా మీమ్స్ హల్‌చల్ చేస్తున్నాయి. ఆస్ట్రేలియా నియంత్రణలోని హియర్డ్, మెక్‌డొనాల్డ్ ఐలాండ్‌లపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఇక్కడ ఎక్కువగా పెంగ్విన్‌లు, ఇతర పక్షులు ఆవాసం ఉంటాయి.

శాశ్వత జనావాసం ఉండదు. ఈనేపథ్యంలో ఆయా దీవులపై ట్రంప్ సుంకాలు వేయడంపై సోషల్‌మీడియా వేదికగా మీమ్స్ వైరల్‌గా మారాయి. టారిఫ్‌ల విషయంపై అధ్యక్షుడు ట్రంప్, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో పెంగ్విన్‌లు చర్చలు జరుపుతున్నట్లు.. టారిఫ్‌లకు వ్యతిరేకంగా పెంగ్విన్‌లు నిరసన తెలుపుతున్నట్లు ఉన్న మీమ్స్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

# దేవుని ఆస్తి దోచుకోవడం దేశ ద్రోహం కంటే ఎక్కువ..




అమరావతి: వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంటు ఉభయ సభల ద్వారా ఆమోదం పొందడం కేవలం పార్లమెంటరీ విజయం కంటే ఎక్కువ ప్రతిబింబిస్తోందని ఇది న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం వైపు ఒక చారిత్రాత్మక అడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో.. ఎన్డీయే పరిపాలన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుందన్నారు. సంవత్సరాలుగా, వక్ఫ్ బోర్డుల కార్యకలాపాల గురించి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు సవాళ్లను పరిష్కరించడం, పారదర్శకతను పెంచడం, వక్ఫ్ ప్రయోజనాలు పేద ముస్లింలకు చేరేలా చూడటం, ముస్లిం మహిళలకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించడం వైపు ఈ సవరణ ఒక ముఖ్యమైన అడుగు అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై ఏకపక్ష నిర్ణయం కాకుండా, ఈ బిల్లును లోక్‌సభలో దాదాపు 12 గంటలు, అలాగే రాజ్యసభలో దాదాపు 14 గంటలు పూర్తిగా చర్చలు జరిగాయని, ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రతి ఆందోళనను పరిష్కరించారని, ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చారని పవన్ కల్యాణ్ అన్నారు. బాధ్యతాయుతమైన, రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం ఇలా పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ముఖ్యమైన బిల్లును ప్రవేశపెట్టడంలో.. మార్గనిర్దేశం చేయడంలో నాయకత్వం వహించినందుకు పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల సంక్షేమ మంత్రి కిరణ్ రిజిజు, హోం మంత్రి అమిత్ షా.. రాజ్యసభలో ఎన్డీయే నాయకుడు జేపీ నడ్డాలకు తాను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ సంస్కరణకు మద్దతు ఇచ్చిన ప్రతి ఎంపీకి, అలాగే వారి మద్దతుకు ముస్లిం సమాజానికి కూడా తాను కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు. తాను 2008-2009 చట్టం చెప్పినట్లుగా, దేవుని ఆస్తి దోచుకోవడం కేవలం దేశ ద్రోహం కంటే ఎక్కువని.. ఇది దేవుడికి ద్రోహమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కొత్త '%ఖవీజుజుణ%' చట్టం కేవలం చట్టం కంటే ఎక్కువని.. ఇది ఒక నైతిక వైఖరి అని అన్నారు. ఇది పవిత్ర ఆస్తులను రక్షించడం, వక్ఫ్ బోర్డును బలోపేతం చేయడం, న్యాయమని, న్యాయానికి ఎన్డీయే ప్రభుత్వం నిబద్ధతను ప్రదర్శించడం గొప్ప విషయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కాగా వక్ఫ్ సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. సుదీర్ఘ చర్చ అనంతరం గురువారం అర్ధరాత్రి దాటాక సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ బిల్లును బుధవారం అర్ధరాత్రి దాటాక లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో 288%-%232 ఓట్లతో బిల్లుకు ఆమోదం లభించింది. వక్ఫ్ సవరణ బిల్లు(యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ (యూఎంఈఈడీ%-%ఉమీద్)'కు లోక్‌సభ ఆమోదం తెలపడంతో కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లును చట్టవిరుద్ధమైనదిగా పేర్కొన్న ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లులో ముస్లిమేతరుల ప్రమేయం ఎంత మాత్రం లేదని స్పష్టం చేశారు. ముస్లింల హక్కులను హరిస్తామన్న ప్రతిపక్షాల ఆరోపణలనూ ఖండించారు. ముస్లింల్లోని అన్ని తెగల వారి హక్కులను పరిరక్షించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బిల్లుతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. "బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేముందు మేం రాష్ట్ర ప్రభుత్వాలు, మైనారిటీ కమిషన్లు, వక్ఫ్ బోర్డులతో సంప్రదింపులు జరిపాం. బిల్లు పరిశీలనకు జేపీసీని ఏర్పాటు చేశాం. సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించింది" అని రిజిజు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 8.72 లక్షల వక్ఫ్ ఆస్తు లు ఉన్నాయన్నారు. 2006లో 4.9 లక్షల వక్ఫ్ ఆస్తు ల ద్వారా రూ.12 వేల కోట్ల ఆదాయం వస్తుందని సచార్ కమిటీ అంచనా వేసిందని, అంటే ప్రస్తుతం ఆయా ఆస్తుల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో ఊహించుకోవచ్చని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణలో లోపాలను, దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ సవరణ బిల్లును తెచ్చినట్లు చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని, వక్ఫ్ ఆస్తులన్నీ ముస్లింలకు మాత్రమే చెందుతాయని స్పష్టంచేశారు. ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా 284 సంస్థలు తమ అభిప్రాయాలను తెలిపాయని, కోటి మందికి పైగా ప్రజలు వినతిపత్రాలు అందించారని వెల్లడించారు. అందరితో సంప్రదింపులు జరిపిన తర్వాతే మైనారిటీ వ్యవహారాల శాఖ ఈ సవరణ బిల్లును రూపొందించిందని రిజిజు స్పష్టం చేశారు. సభ్యులందరూ బిల్లుకు మద్దతు తెలుపుతారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సభ్యుడు సయ్యద్ నజీర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్వేషాలు రెచ్చగొట్టి, మతపరమైన ఏకీకరణ కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అబద్ధాల ఆధారం గా సవరణ బిల్లును రూపొందించారని, ఆరు నెలలుగా బీజేపీ వక్ఫ్ బిల్లుపై దుష్ప్రచారం చేసిందని ధ్వజమెత్తారు.



# రూ.28.97లక్షల విలువైన మద్యం ధ్వంసం

అమరావతి: కృష్ణా జిల్లాలో రూ.28.97లక్షల విలువ చేసే మద్యాన్ని జిల్లా పోలీసులు ధ్వంసం చేశారు. 2013 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి మధ్య కాలంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించగా వివిధ కేసుల్లో 15,280 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటినీ తాజాగా ఎస్పీ గంగాధరరావు పర్యవేక్షణలో పోలీసులు రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. 684 లీటర్ల నాటుసారాను పారబోశారు.

## కీర్తి సురేష్.. చీరలో కూడా హై గ్లామర్ డోస్

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గత ఏడాది 'బేబీ జాన్' మూవీతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అయితే ఈ మూవీ ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. బిగ్గెస్ట్ డిజాస్టర్ గా మారింది. కానీ ఈ సినిమాలో కీర్తి సురేష్ కాస్త గ్లామర్ డోస్ పెంచి నటించింది. సాంగ్స్ లో కూడా అల్ట్రా మోడ్రన్ లుక్స్ లో మెస్మరైజ్ చేసింది. దీంతో బాలీవుడ్ మీడియా కీర్తి సురేష్ ని బాగా వైరల్ చేసింది. సౌత్ లో స్టార్ హీరోలతో జతకట్టిన కీర్తి సురేష్ ఎప్పుడు కూడా గ్లామర్ షో పరంగా లిమిటేషన్స్ లోనే ఉంది. అయితే బాలీవుడ్ లో సక్సెస్ కావాలంటే లుక్స్ మార్చాల్సిందే అని ఫిక్స్ అయినట్లు ఉంది. దీంతో మునుపెన్నడూ లేని సరికొత్త అందంతో కీర్తి సురేష్ ప్రస్తుతం సందడి చేస్తోంది. పెళ్లి తర్వాత ఎక్కువగా ఈ బ్యూటీ చీరలలోనే కనిపిస్తున్న కూడా వాటికి మోడ్రన్ టచ్ చేస్తోంది. స్టన్నింగ్ లుక్స్ తో మెస్మరైజ్ చేస్తోంది. ఈ బ్యూటీ హిందీలో 'అక్క' అనే వెబ్



సిరీస్ లో నటించింది. రాధికా ఆప్టే తో పాటు ఈ సిరీస్ లో కీర్తి సురేష్ నటించింది. తాజాగా ఈ వెబ్ సిరీస్ టీజర్ లో రిలీజ్ అయ్యింది. ఈ సందర్భంగా జరిగిన ఈవెంట్ లో కీర్తి సురేష్ పాల్గొంది. వైట్ కలర్ శారీలో, కర్లీ హెయిర్ తో ఉన్న మోడ్రన్ మహారాణిలా ఈ కీర్తి సురేష్ ఈ ఈవెంట్ లో కనిపించింది. 'అక్క' టీజర్ లో ఆమె క్యారెక్టర్ కూడా చాలా పవర్ ఫుల్ గా ఉన్నట్లు కనిపిస్తోంది. కాస్త గ్రే షేడ్స్ లో సీరియస్ మూడ్ లో కీర్తి సురేష్ టీజర్ లో కనిపించింది. ఫీమేల్ సెంట్రిక్ గా ఈ వెబ్ సిరీస్ ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నెట్ ఫ్లిక్స్ లో ఈ సిరీస్ రిలీజ్ కానుంది. ఇక 'అక్క' టీజర్ రిలీజ్ సందర్భంగా కీర్తి సురేష్ తీసుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలలో కీర్తి సురేష్ చాలా అందంగా ఉందనే మాట వినిపిస్తోంది. పెళ్లి తర్వాత ఆమె స్టైల్, లుక్స్, బాడీ లాంగ్వేజ్ లో పూర్తిగా మార్పు వచ్చిందని ఈ లుక్స్ చూసిన నెటిజన్లు అంటున్నారు. చాలా కాన్ఫిడెంట్ గా క్వీన్ లా రాజసం ఉట్టిపడే విధంగా కీర్తి లుక్స్ ఉన్నాయని కామెంట్స్ చేస్తున్నారు. ఇదే లుక్స్ మెయింటేన్ చేస్తే కచ్చితంగా బాలీవుడ్ లో ఆమె స్పీడ్ పెరగడం ఖాయం అని అందరు అనుకుంటున్నారు.

## రాధే శ్యామ్ సినిమా వల్లే ఆ అవకాశమొచ్చింది

నాలుగేళ్ల ముందు వరకు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డ గత రెండేళ్లుగా వరుస ఫ్లాపులతో సతమతమవుతుంది. బాలీవుడ్ లో సెటిల్ అవుదామనుకుని తెలుగులో వచ్చిన ఆఫర్లను కొన్ని కాదనుకోవడం, తర్వాత తను నటించిన సినిమాలు ఫ్లాప్ అవడంతో అమ్మడికి తెలుగులో అవకాశాలు రావడం తగ్గిపోయాయి. రీసెంట్ గా బాలీవుడ్ సినిమా దేవాతో ప్రేక్షకుల్ని పలకరించిన పూజా ఆ సినిమాతో మరో ఫ్లాపును మూటగట్టుకుంది. ఇదిలా ఉంటే అమ్మడు తమిళంలో స్టార్ హీరో సూర్య సరసన రెట్రో సినిమాలో ఛాన్స్ అందుకున్న విషయం తెలిసిందే. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తి చేసుకుంది. సౌత్ లో అవకాశాలు లేని టైమ్ లో వచ్చిన రెట్రో ఛాన్స్



ను గట్టిగా వాడుకోవాలని పూజా ఈ సినిమా కోసం చాలా కష్టపడుతుంది. ఓ రకంగా చెప్పాలంటే ఇలాంటి టైమ్ లో పూజా సూర్య సరసన అవకాశం అందుకోవడమంటే అదృష్టమనే చెప్పాలి. అయితే ఈ అదృష్టం తనకెలా దక్కిందో పూజా రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. రెట్రోలో తనకు ఛాన్స్ రావడం గురించి మాట్లాడుతూ ఈ అవకాశం రావడానికి కారణం రాధే శ్యామ్ సినిమా అని చెప్పింది పూజా. రాధే శ్యామ్ సినిమాలో తన ఎమోషనల్ సీన్స్ చూసి డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ ఈ సినిమా కోసం తనను ఎంపిక చేశారని తెలిపింది. రెట్రోలో తన పాత్ర చాలా భిన్నంగా ఉంటుందని, ఇందులో కూడా చాలా ఎమోషనల్ సీన్స్ ఉన్నాయని పూజా ఈ సందర్భంగా వెల్లడించింది. దీంతో పాటూ విజయ్ తో కలిసి చేస్తున్న సినిమా గురించి కూడా పూజా మాట్లాడింది. జన నాయకుడు సినిమాలో తాను కూడా భాగమవడం ఎంతో సంతోషంగా ఉందని, విజయ్ ఆఖరి సినిమా అనగానే ఏమీ ఆలోచించకుండా వెంటనే ఈ సినిమా ఒప్పుకున్నట్టు పూజా వెల్లడించింది. అయితే గతంలో వీరిద్దరూ కలిసి బీస్ట్ అనే సినిమాలో నటించిన విషయం తెలిసిందే. బీస్ట్ కూడా ఫ్లాప్ గానే నిలిచింది. ఇప్పుడు కోలీవుడ్ లో చేస్తున్న ఈ రెండు సినిమాలతో అయినా పూజా హిట్ ట్రాక్ ఎక్కుతుందేమో చూడాలి.




## ఆ క్రేజీ సినిమా క్లైమాక్స్ ట్విస్ట్ ఇస్తారా..?



తమిళ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజు డైరెక్షన్ లో రెట్రో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సూర్య కార్తీక్ సుబ్బరాజు కాంబోలో క్రేజీ మూవీపై అంచనాలు భారీ రేంజ్ లో ఉన్నాయి. కోలీవుడ్ యువ దర్శకుడిగా కార్తీక్ తీసిన సినిమాలు అతని టాలెంట్ ఏంటన్నది తెలిసేలా చేసింది. ఐతే రెట్రో తో సూర్య మార్క్ మాస్ ఎంటర్ టైనర్ తో రాబోతున్నాడు. ఈ సినిమా కథ సూర్యని ఇంప్రెస్ చేసిందట. సూర్య బలంగా నమ్ముతున్న కథ అని తెలుస్తుంది. అందుకే నిర్మాతగా కూడా మరెవరో ఎందుకు అని సూర్య తన 2%ణ% ఎంటర్టైన్మెంట్ బ్యానర్ లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రెట్రో సినిమాలో వింటేజ్ సూర్య ని చూడబోతున్నారని టీజర్ తోనే చూపించారు. ఒకప్పటి మాస్ సూర్య ఈసారి రెట్రో గా ఫ్యాన్స్ కి ట్రీట్ ఇవ్వనున్నాడు. టీజర్ కట్ లో సూర్య వింటేజ్ షేడ్స్ ఫ్యాన్స్ కి సూపర్ జోష్ అందించాయి.

డైరెక్టర్ కార్తీక్ సినిమా లకు ఒక సెపరేట్ స్టైల్ ఉంటుంది. అందుకే రెట్రో టీజర్ తోనే ఒక క్రేజీ బజ్ ఏర్పడేలా చేశారు. ఇదే కాకుండా రెట్రో సినిమాలో హీరోయిన్ గా పూజా హెగ్డే నటించడం కూడా ఒక ప్లస్ పాయింట్ అని చెప్పొచ్చు. అమ్మడు సినిమాలో ఉంది అంటే గ్లామర్ విషయం లో డోకా లేదన్నట్టే లెక్క. ఐతే రెట్రో టీజర్ లో పూజా బేబ్ హెూమ్లీ లుక్ బాగున్నా ఫ్యాన్స్ కి కావాల్సిన గ్లామర్ సినిమాలో ఉంటుందని తెలుస్తుంది. ఇక ఇప్పటికే రెట్రో నుంచి రిలీజ్ అయిన ఒక సాంగ్ ట్రెండింగ్ లో ఉంది. సాంగ్ తో సినిమా పై ఒక గ్రేట్ వైబ్ తెచ్చారు మేకర్స్. ఐతే లేటెస్ట్ గా రెట్రో నుంచి మరో షాకింగ్ న్యూస్ లీక్ అయ్యింది. రెట్రో సినిమా చివర్లో ఎవరు ఊహించని ట్విస్ట్ ఉంటుందట. రెట్రో క్లైమాక్స్ లో పార్ట్ 2 కి లీడ్ ఉంటుందని టాక్. అంటే రెట్రో సినిమా కూడా బాహుబలి, పుష్ప తరహాలో రెండు భాగాలుగా ప్లాన్ చేస్తున్నారట. అదే జరిగితే మాత్రం సూర్య ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే లెక్క. సూర్య రెట్రో పై అంచనాలు ఉన్నా కూడా సినిమా ని చాలా సైలెంట్ గా పూర్తి చేశారు. అంతేకాదు సినిమాలో అసలు కంటెంట్ ఏంటన్నది రివీల్ చేయకుండా ప్రమోషన్స్ ప్లాన్ చేస్తున్నారట. మే 1 పాన్ ఇండియా లెవెల్ లో సూర్య రెట్రో రిలీజ్ అవుతుంది. మరి ఈ సినిమా పై ఫ్యాన్స్ పెట్టుకున్న ఆశలు ఎంతవరకు నిజం అవుతాయన్నది చూడాలి.

## సమంతకు ఐకానిక్ గోల్డ్ అవార్డు..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తన నటనతోనే కాకుండా యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో కూడా అదరగొడుతుంది. సమంత గతేడాది రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో సిటాడెల్ హనీ బన్నీ అనే వెబ్‌సిరీస్ చేసిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌కు ఆడియన్స్ నుంచి మంచి ఆదరణ దక్కింది. ఈ సిరీస్ లో సమంత తన నటనతో టాలీవుడ్ ఆడియన్స్‌నే కాకుండా బాలీవుడ్ ప్రేక్షకుల్ని కూడా మాయ చేసింది. ఈ సిరీస్ కోసం సమంత మొదటిసారి బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ తో కలిసి నటించింది. ఇదిలా ఉంటే ఈ సిరీస్‌కు గానూ తాజాగా సమంతకు ఐకానిక్ గోల్డ్ అవార్డు లభించింది. అంతేకాదు ఈ సిరీస్ కు బెస్ట్ వెబ్ సిరీస్ గా కూడా అవార్డు వచ్చింది. ఈ విషయాన్ని డైరెక్టర్ డీకే తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా షేర్ చేసుకున్నాడు. ఈ వెబ్ సిరీస్ ను ఆడియన్స్ ముందుకు తీసుకురావడానికి ఎంతో మంది కృషి చేశారని, అవార్డుల రూపంలో అందరూ చూపిస్తున్న ప్రేమకు ఎప్పటికీ ఋణపడి ఉంటానని డీకే తెలిపాడు. డీకే పోస్ట్ తో ఈ విషయం వైరల్ అవడంతో సమంతకు ఐకానిక్ గోల్డ్ అవార్డు రావడంపై అందరూ ఆమెకు విషెస్ తెలుపుతున్నారు. ఇక సిరీస్ లో సమంత తన నటనతో అందరినీ కట్టిపడేసింది. సిటాడెల్ కోసం సమంత ఎంత కష్టపడిందో అందరికీ తెలుసు. సమంత పడిన కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించిందని అటు టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలు సైతం కామెంట్స్ చేస్తున్నారు.

వ్యక్తిగతంగా సమంత పలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కెరీర్ పరంగా మాత్రం సామ్ సక్సెస్‌ఫుల్ గా దూసుకెళ్తుంది. టాలీవుడ్ లో సమంత నుంచి తెలుగులో ఆఖరిగా వచ్చిన సినిమా ఖుషి. విజయ్ దేవరకొండతో చేసిన ఆ సినిమా యావరేజ్ అనిపించుకుంది. అప్పట్నుంచి సమంత తెలుగులో మరో సినిమాను ఒప్పుకుంది లేదు. గతేడాది సొంత బ్యానర్ లో మా ఇంటి బంగారం అనే సినిమాను అనౌన్స్ చేసింది కానీ అప్పట్నుంచి దాని గురించి మళ్లీ ఎలాంటి అప్డేట్ లేదు. ప్రస్తుతం సమంత రక్త్ బ్రహ్మాండ్ అనే హిందీ ప్రాజెక్టులో నటిస్తోంది.

## స్టార్ హీరో సినిమాలో శ్రియ స్పెషల్ సాంగ్

స్టార్ హీరోల సినిమాల్లో భారీ సినిమాల్లో ఈ మధ్య స్పెషల్ సాంగ్స్ ఎక్కువైపోయాయి. స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ ఉందంటే ఆ సాంగ్ ఎవరు చేస్తున్నారా? ఆ పాట ఎలా ఉండబోతుందనే ఆసక్తి ముందునుంచే అందరిలో ఉంటుంది. స్టార్ హీరోల సినిమాలన్నీ పాన్ ఇండియా లెవెల్లో రిలీజవుతున్న నేపథ్యంలో అగ్ర హీరోయిన్లు సైతం ఈ స్పెషల్ సాంగ్స్ చేయడానికి వెనుకడుగేయట్లేదు. అలాంటి స్పెషల్ ఆఫర్లు వచ్చినప్పుడు చేయడం వల్ల భారీ రెమ్యూనరేషన్ తో పాటూ, నేషనల్ లెవెల్లో తమకు క్రేజ్ పెరగడం ఖాయం. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో చేస్తున్న రెట్రో సినిమాలో ఓ ఐటెం సాంగ్ ఉన్నట్టు తెలుస్తోంది. పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటున్న ఈ



యాక్షన్ ఎంటర్టైనర్ కు సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ సినిమాలో ఆ స్పెషల్ సాంగ్ ను శ్రియా శరణ్ చేస్తున్నట్టు సమాచారం. రెట్రో స్పెషల్ సాంగ్‌లో సూర్యతో కలిసి శ్రియ కాలు కదిపినట్టు తెలుస్తోంది. ఈ స్పెషల్ సాంగ్‌ను వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేయనున్నట్టు సమాచారం. టాలీవుడ్ లో తన సినీ కెరీర్ ను మొదలుపెట్టిన శ్రియ ఆ తర్వాత తమిళ సినిమాల్లో కూడా నటించి కోలీవుడ్ లో కూడా స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది. స్టార్ హీరోల సరసన నటించి అందరి మనసులు గెలుచుకున్న శ్రియ విదేశీ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకుని కొంత కాలం పాటూ సినిమాలకు దూరమైంది. తర్వాత మళ్లీ ఆర్ఆర్ఆర్ లో కనిపించిన శ్రియ తమిళ సినిమాలో కనిపించి చాలా కాలమే అవుతోంది. ఏడేళ్ల తర్వాత మళ్లీ తమిళ సినిమాలో చేయడం ఎంతో సంతోషంగా ఉందని శ్రియ ఈ సందర్భంగా తెలిపింది. రెట్రో సినిమా సమ్మర్ స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. కంగువ సినిమా డిజాస్టర్ అవడంతో సూర్య తన ఆశలన్నీ రెట్రో సినిమాపైనే పెట్టుకున్నాడు. ఇదిలా ఉంటే ప్రస్తుతం సూర్య, ఆర్జె బాలాజీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే.

## బేబమ్మ అప్పుడే అలా అవసరమా?

ఉప్పెన సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కృతి శెట్టి. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేసిన ఈ అమ్మడు అంతే స్పీడ్‌గా కనిపించకుండా పోయింది. టాలీవుడ్‌లో ఈమెకు ఒక్క ఆఫర్ లేదు. కోలీవుడ్‌లో మాత్రం రెండు మూడు సినిమాలు చేస్తోంది. మలయాళంలో ఈ అమ్మడు సినిమాలు చేసింది. ఒకటి రెండు అక్కడ చర్చల దశలో ఉన్నాయి. ప్రస్తుతానికి తెలుగులో ఆఫర్లు రాకున్నా తమిళ్, మలయాళంలో ఆఫర్లు ఉన్నాయి. అయినా ఈ అమ్మడు తీసుకున్న నిర్ణయం షాకింగ్‌గా ఉంది. బాలీవుడ్‌లో ఈ అమ్మడు అడుగు పెట్టేందుకు రెడీ అయ్యింది. అది కూడా ఐటెం సాంగ్ తో కావడం ఆశ్చర్యకరమైన విషయం. కృతి శెట్టి ప్రస్తుతం చేస్తున్న తమిళ్ సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉండగానే బాలీవుడ్ నుంచి వచ్చిన ఐటెం సాంగ్ ఆఫర్‌కి ఓకే చెప్పింది. త్వరలోనే ఆ హిందీ సినిమా ఐటెం సాంగ్‌లో నటించబోతుంది. కృతి శెట్టి వంటి క్యూట్ ఇమేజ్ ఉన్న ముద్దుగుమ్మలు ఐటెం సాంగ్స్ చేయడం ద్వారా వచ్చే పాపులారిటీ, క్రేజ్ కంటే డ్యామేజీ ఎక్కువ అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తూ ఉంటారు. ఐటెం సాంగ్స్ చేయాలంటే మాస్ బాడీలాంగ్వేజ్ ఉండాల్సిన



అవసరం ఉంది. అందుకే కృతి శెట్టి ఐటెం సాంగ్ చేస్తే ఎంత వరకు వర్కౌట్ అవుతుంది అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలుగులో కృతి శెట్టిని ఐటెం సాంగ్‌లో చూడాలని ఎవరూ అనుకోరు. ఎందుకంటే ఆమెకు ఉప్పెన సినిమాతో తెలుగులో బేబమ్మ అనే క్యూట్ అమ్మాయి ఇమేజ్ దక్కింది. కనుక ఐటెం సాంగ్ చేయడం వల్ల ఆమెకు నెగిటివిటీ ఎక్కువ వస్తుంది. కానీ బాలీవుడ్‌లో కృతి శెట్టి పెద్దగా ఎవరికీ తెలియదు. కనుక అక్కడ సినిమాలో ఐటెం సాంగ్ చేస్తే ఏమైనా ఫలితం ఉంటుందేమో అని ఆమె భావిస్తుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు రెగ్యులర్‌గా షేర్ చేసే ఫోటోలు సైతం క్యూట్ అండ్ క్లీన్‌గా అనిపిస్తూ ఉంటాయి. ఎక్కడా ఐటెం సాంగ్ హీరోయిన్ తాలూకు అతి కనిపించదు అనేది కొందరి అభిప్రాయం. బాలీవుడ్‌లో ఈ అమ్మడు చేయబోతున్న ఐటెం సాంగ్ విషయమై క్లారిటీ రావాల్సి ఉంది. ఒక్క టర్నింగ్ పాయింట్ కోసం కృతి శెట్టి చాలా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ముందు ముందు ఈ అమ్మడి నుంచి వచ్చే సినిమాలు, ప్రత్యేక పాటలతో మరింత పాపులారిటీ సొంతం చేసుకుని తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి. తెలుగులో బేబమ్మ పాత్రలో నటించి మెప్పించడం ద్వారా అదే జోనర్‌లో ఆమెను ప్రేక్షకులు చూడాలని కోరుకుంటున్నారు. అందుకే కృతి శెట్టి ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్త తెలిసిన వెంటనే ఎక్కువ శాతం మంది అలా అవసరమా అంటూ ఆమెను ప్రశ్నిస్తున్నారు.



# సీతమ్మకు 'సిరిసిల్ల' బంగారు చీర

సిరిసిల్ల: శ్రీరామ నవమి సందర్భంగా సిరిసిల్లకు చెందిన నేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ ప్రత్యేకంగా పట్టు వస్త్రాలను సిద్ధం చేశారు. పది రోజుల పాటు శ్రమించి నేసిన ఈ పట్టు చీర కొంగుపై భద్రాద్రి ఆలయ మూల విరాట్‌ను నేశారు. శంఖు, చక్ర నామాలు, హనుమంతుడు, గరుత్మంతుడును చీర బోర్డర్‌పై చూడొచ్చు. 'శ్రీరామ రామ రామేతి'.. శ్లోకం చీరపై 51 సార్లు కనిపిస్తుంది. వన్ గ్రామ్ గోల్డ్ జరీ పట్టుతో రూపొందించిన ఈ ఏడు గజాల చీర బరువు దాదాపు 800 గ్రాములు. "ఏటా సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు నేసే అవకాశం సిరిసిల్ల నేతన్నలకు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుకుంటున్నాని" హరిప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క భేటీ

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల అంశంపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎస్ శాంతికుమారి, అటవీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చెట్ల తొలగింపు పనులతో పాటు ఆ భూమిలో చెట్ల సంరక్షణ మినహా అన్నిరకాల కార్యకలాపాలను తక్షణం నిలిపేయాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించిన సంగతి తెలిసిందే.

మూడు రోజుల్లోనే 100 ఎకరాల్లో చెట్లను కొట్టేయడంపై ఆక్షేపణ వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూ వివాదాన్ని పరిష్కరించేందుకు ముగ్గురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ఎగ్జిక్యూటివ్ కమిటీ, విద్యార్థుల ప్రతినిధులు, జాయింట్ యాక్షన్ కమిటీ, సివిల్ సొసైటీ గ్రూపులు సహా భాగస్వాములైన ప్రతి ఒక్కరితో చర్చిస్తుంది. కమిటీలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి



విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో భేటీ అయినట్లు తెలుస్తోంది.



# 3 వారాల్లో రికార్డులు అందజేయండి

## వామనరావు దంపతుల హత్య కేసు.. 3 వారాల్లో రికార్డులు అందజేయండి: సుప్రీంకోర్టు

ఢిల్లీ: తెలంగాణకు చెందిన న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణి హత్య కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీబీఐ విచారణ జరపాలన్న పిటిషన్‌పై వాదనలు జరిగాయి. కేసుకు సంబంధించి వీడియోలు సహా అన్ని పత్రాలు తమ ముందుంచాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. రికార్డులను పరిశీలించి సీబీఐ విచారణపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు ధర్మాసనం.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 3 వారాల్లో రికార్డులు అందజేయాలని ఆదేశించింది. విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.




# మన స్టార్టప్‌లు చిప్స్, ఐస్‌క్రీమ్‌ల దగ్గరే ఆగిపోకూడదు..

భారత్ స్టార్టప్‌లను ఉద్దేశించి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని పలు అంకుర సంస్థలు ఫుడ్ డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి యాప్‌లపై ఎక్కువగా దృష్టి సారించాయన్నారు. కానీ చైనాలోని స్టార్టప్‌లు మాత్రం ఇందుకు భిన్నమైన రంగాలను ఎంచుకుంటున్నాయని చెప్పారు. "దేశంలో ప్రస్తుతం ఉన్న స్టార్టప్‌ల పరిస్థితి చూస్తే.. మనం ఫుడ్ డెలివరీ యాప్స్‌పై దృష్టిసారించాం. ఇలాంటి వాటి వల్ల దిగువ శ్రేణి కార్మికులు తయారై సంపన్నులు కాలు బయటపెట్టకుండా ఆహారం పొందగలుతున్నారు. ఇదే సమయంలో చైనా సంస్థలు ఏఐ, ఈవీలు, సెమీ కండక్టర్ల రంగాలను ఎంచుకుంటున్నాయి. భారత్‌లో డీప్-టెక్ స్టార్టప్‌లు పరిమిత సంఖ్యలోనే వస్తున్నాయి.

ఆ రంగంలో కేవలం 1,000 స్టార్టప్‌లు మాత్రమే ఉండటం ఆందోళనకర పరిస్థితి. ఇక్కడి యువతరం గొప్ప ఆలోచనలు రూ.25 లక్షలు, రూ.50 లక్షలకు విదేశీ కంపెనీలకు అమ్ముడుపోతున్నాయి. కొత్త అంకుర సంస్థలు భవిష్యత్ తరాల కోసం దేశాన్ని సిద్ధం చేయాలి. మనం ఐస్‌క్రీం, చిప్స్ అమ్మడం దగ్గరే ఆగిపోకూడదు. డెలివరీ బాయ్స్/గర్ల్స్‌గానే మిగిలిపోదామా? అదే భారత్ లక్ష్యమా..? అది అంకురాల ఉద్దేశం కాదు" అని స్టార్టప్ మహాకుంబ్ కార్యక్రమంలో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సీఈఓ అదిత్ పలిచా స్పందించారు. విమర్శించడం తేలిక అంటూ మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు. "యూఎస్, చైనాలోని డీప్ టెక్ నైపుణ్యంతో పోల్చి, భారత్‌లోని కన్స్యూమర్ ఇంటర్నెట్ స్టార్టప్‌లను విమర్శించడం చాలా తేలిక. ప్రస్తుతం జెప్టోలో 1.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. 3.5 సంవత్సరాల క్రితం అసలు ఆ సంస్థే లేదు. మేం పన్నులు చెల్లిస్తున్నాం. దేశంలోకి విదేశీ పెట్టుబడులు వచ్చాయి. సరఫరా గొలుసులను నిర్వహించేందుకు వందల కోట్ల పెట్టుబడులు పెట్టారు. భారత ఆవిష్కరణల్లో ఇదొక అద్భుతం కాకపోతే.. మరి దీన్ని ఏమంటారో నాకు తెలియదు. భారత్‌కు భారీస్థాయిలో ఏఐ మోడల్ ఎందుకు లేదు..? ఎందుకంటే, అమెజాన్, ఫేస్‌బుక్, అలీబాబా, గూగుల్ వంటి పెద్ద ఇంటర్నెట్ సంస్థలు ఇక్కడ లేవు. అవి కూడా కన్స్యూమర్ ఇంటర్నెట్ కంపెనీలుగా ప్రస్థానం మొదలుపెట్టినవే. అవే ఏఐ వంటి ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తున్నాయి. వాటి వద్ద విస్తృత డేటా, టాలెంట్, పెట్టుబడులు ఉన్నాయి. అందుకే అది సాధ్యమైంది.

స్టార్టప్ ఎకోసిస్టమ్, ప్రభుత్వం, మూలధనాన్ని కలిగి ఉన్న యాజమాన్యాలు.. ఈ స్థానిక ఛాంపియన్లకు మద్దతు ఇవ్వాలి. అంతేగానీ ఎదగడానికి ప్రయత్నిస్తున్నవారిని అణచి వేయకూడదు" అని పలిచా అన్నారు. భారత స్టార్టప్‌లను తక్కువ చేయొద్దని, డీప్‌టెక్ సంస్థల వృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి సహాయం అందిస్తోందని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌ఓ మోహన్‌దాస్ పాయ్ ప్రశ్నించారు.

# తెలంగాణ గ్రూప్ 1 నియామాకాలకు తొలగిన అడ్డంకి



ఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జీవో 29 చెల్లుబాటును సవాల్ చేస్తూ గ్రూప్ 1 అభ్యర్థులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న తెలంగాణ ప్రభుత్వం జీవో 29ని జారీ చేసింది.

దీనిని రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా పిటిషన్ కొట్టివేతతో గ్రూప్ 1 నియామకాలకు అడ్డంకి తొలగినట్లైంది. ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది. త్వరలో 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన చేయనుంది.



# 40 గంటలకు పైగా ఎయిర్‌పోర్టులోనే.. ఒకటే టాయిలెట్

లండన్ నుంచి ముంబయికి రావాల్సిన విమానం తుర్కియేలో అత్యవసరంగా ల్యాండ్ అయిన సంగతి తెలిసిందే. దాదాపు 40 గంటలుగా ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లోనే చిక్కుకుపోయారు. విమానాశ్రయం ఓ మారుమూల ప్రాంతంలో ఉండటంతో ప్రయాణికులు సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 2న లండన్ నుంచి వర్జిన్ అట్లాంటిక్ విమానం ముంబయికి బయలుదేరింది. మొత్తం 250 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. అందులో 200 మందికి పైగా భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా తుర్కియేలోని మారుమూల ప్రాంతంలోని దియార్‌బకిర్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. అయితే ల్యాండ్ అయిన తర్వాత విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో దాదాపు 40 గంటలుగా ప్రయాణికులు అక్కడే చిక్కుకుపోయారు. ఎయిర్‌పోర్టులో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఎక్స్ వేదికగా తమ ఆవేదనను పంచుకుంటున్నారు. ఇన్ని గంటలు గడుస్తున్నా ఎయిర్‌లైన్ ప్రతినిధులెవరూ తమను సంప్రదించలేదని వారిలో ఒకరు పేర్కొన్నారు. అందరికీ సరిపడా ఆహార ప్యాకెట్‌లు ఇక్కడి సిబ్బంది అందించలేకపోతున్నారని వాపోయారు. ఒక్క టాయిలెట్ రూమ్ మాత్రమే ఉందని, సెల్‌ఫోన్ ఛార్జింగ్ పాయింట్లు కూడా లేవని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారన్నారు. త్వరగా ప్రత్యామ్నాయ విమానం ఏర్పాటుచేసి.. తమను ముంబయికి తరలించాలని వేడుకుంటున్నారు.

**స్పందించిన వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్..** 'మా ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మాకు ముఖ్యం. మీ అసౌకర్యానికి మా హృదయ పూర్వక క్షమాపణలు. ఏప్రిల్ 4 స్థానిక కాలమానం ప్రకారం 12:00 గంటలకు దియార్‌బకిర్ విమానాశ్రయం నుంచి ముంబయికి %ఖా%1358 విమానాన్ని ఏర్పాటుచేస్తాం. ఒకవేళ దీనికి అనుమతులు లభించకపోతే.. ప్రయాణికులను మరొక ఎయిర్‌పోర్టుకు తరలించేందుకు బస్సును ఏర్పాటుచేస్తాం. ఆ తర్వాత మరో విమానంలో వారిని ముంబయికి పంపిస్తాం. రాత్రి వేళలో ప్రయాణికులు బస చేసేందుకు ఏర్పాట్లు చేస్తాం. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం' అని వర్జిన్ అట్లాంటిక్ ప్రతినిధి పేర్కొన్నారు. ఇక, ఈ ఘటనపై అంకారాలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్, దియార్‌బాకిర్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ముంబయికి వెళ్లేందుకు మరో విమానం ఏర్పాటుకు సంబంధిత అధికారులతో చర్చిస్తున్నట్లు వెల్లడించింది.



# ట్రంప్ ఎఫెక్ట్ ఐఫోన్ ధరలకు రెక్కలు..!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం దెబ్బకు యాపిల్ సంస్థ విలవిల్లాడనుంది. ఐఫోన్ ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మోడల్‌ను బట్టి వీటి ధరలు 30-40శాతం వరకు పెరగవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఐఫోన్లు చైనాలో తయారవుతాయి. దీంతో ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు వీటిపై పడతాయి. ఈనేపథ్యంలో సంస్థ వీటిని భరించడమా.. లేక వినియోగదారులపై మోపడమా అనేది యాపిల్ నిర్ణయించాల్సి ఉంది. చాలామందికి అందుబాటులో ఉండే ఐఫోన్ 16 మోడల్ ధర 799 డాలర్లు (రూ.68 వేలు). యాపిల్ కనుక పన్నుల భారం వినియోగదారుల పైకి బదలాయిస్తే.. ఇది 1,142 డాలర్లకు (రూ.97వేలు)కు చేరవచ్చని అంచనా. ఇక ప్రీమియం మోడల్ ఐఫోన్ 16 ప్రోమ్యాక్స్ (1టెరాబైట్ మోడల్) 2,300 డాలర్లకు (రూ.2 లక్షలకు) చేరవచ్చు. గతంలో యాపిల్ అదనపు పన్నులు తప్పించుకొనేందుకు ప్రత్యేక మినహాయింపులు పొందింది. కానీ, ఈసారి అవేవీ లభించేలా లేవు. అమెరికా వ్యాపార సంస్థలు చైనా నుంచి తమ ఫ్యాక్టరీలను తరలించేలా ఒత్తిడి పెంచేందుకు ట్రంప్ అదనపు పన్నులు విధించారు. ఇప్పటికే ఐఫోన్ల విక్రయాలు ప్రధాన మార్కెట్లలో అనుకున్న స్థాయిలో లేవు. దీనికితోడు తాజా పన్నుల కారణంగా ధరలు పెరిగితే.. వాటిపై మరింత ప్రతికూల ప్రభావం పడొచ్చు. దీంతో కస్టమర్లు ఇతర ఆప్షన్లపై దృష్టిపెట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా యాపిల్ ప్రధాన పోటీదారు శామ్‌సంగ్ లబ్ధిపొందే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిన్న సుంకాల ఢంకా మోగించిన సంగతి తెలిసిందే. అమెరికాకు దిగుమతయ్యే ప్రతి వస్తువు పైనా కనిష్ఠంగా 10శాతం నుంచి గరిష్ఠంగా 49శాతం వరకు సుంకాలు విధించారు. మన దేశంపై 26 శాతంతో విరుచుకుపడ్డారు. చైనాపై 34% బాదేశారు. ఐరోపా దేశాలపై 20% విధించారు.



# హైదరాబాద్ స్థానిక సంస్థల భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావు

హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల భాజపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్.గౌతమ్‌రావును అధిష్ఠానం ప్రకటించింది.

భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. మే 1తో ఎమ్మెల్సీ ప్రభాకర్ పదవీకాలం ముగియనుంది. దీంతో ఈ స్థానానికి ఏప్రిల్ 23న పోలింగ్, 25న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

# ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం

హైదరాబాద్: భాజపా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావును ప్రకటించడంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పార్లమెంట్ నియోజకవర్గానికే పోస్టులు ఇస్తారా? అంటూ పరోక్షంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానిం చారు. "భాజపాలో సీనియర్ నేతలు, కార్యకర్తలు కనబడటం లేదా? మీకు గులాంగిరీ చేసే వాళ్లకే పోస్టులు, టికెట్లు కేటాయిస్తున్నారు. అలా చేయని మిగతావాళ్లని పక్కనపెడుతున్నారు" అని రాజాసింగ్ పేర్కొన్నారు.



# ఏసీబీ వలలో గుమ్మడిదల నీటిపారుదల ఏఈ

గుమ్మడిదల: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నీటిపారుదల ఏఈ రవి కిశోర్ ఏసీబీ వలలో చిక్కుకున్నారు. రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ రైతు పొలానికి నీరు పారేందుకు వీలుగా చిన్న కల్వర్టు కట్టినందుకు ఏఈ రవి కిశోర్ బెదిరించారు. ఎన్‌ఓసీకి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దీని కోసం లంచం డిమాండ్ చేశారు. తొలుత రూ.10 లక్షలు డిమాండ్ చేసి.. రూ.7 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ముందుగా రూ. లక్ష ఇవ్వాలని అడగడంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో పక్కా ప్రణాళిక ప్రకారం.. పటాన్‌చెరు ఇంజినీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ఏసీబీ అధికారులు కిశోర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# కాంగ్రెస్ నేతకు గుండెపోటు.. సీపీఆర్ చేసి కాపాడిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు




అకస్మాతుగా అస్వస్థతకు గురై కింద పడిపోయిన వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. భద్రాచలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుతో పాటు ఎమ్మెల్యే వెంకట్రావు పర్యటించారు. వారి వెంట ఉన్న వారిలో కాంగ్రెస్ నేత సుధాకర్ అనే వ్యక్తి గుండెపోటుకు గురయ్యారు. ఒక్కసారిగా ఆయన కిందపడిపోవడంతో డాక్టర్ వెంకట్రావు వెంటనే సీపీఆర్ చేశారు. అనంతరం అతడిని ఆస్పత్రికి తరలించారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com